# నగరనిజం



www.nagaranijam.com    అక్షరనిజం నగరనిజం    తెలుగు మాస పత్రిక

సామాజిక,రాజకీయ,విద్య,వైద్య,పర్యావరణ,వ్యాపార,సినీ మాసపత్రిక    TELUGU MONTHLY

VOLUME : 15   ISSUE : 5   EDITOR- YELA.PURUSHOTHAM   MAY-2026   PAGES : 68   Price : Rs.12/-   RANGAREDDY

సంపుటి : 15   సంచిక : 5   ఎడిటర్ : ఏలే.పురుషోత్తం   మే-2026   పేజీలు : 68   వెల : 12/- రంగారెడ్డి

## ఎడిటర్
## ఏలే.పురుషోత్తం

**సబ్ ఎడిటర్**
ఏ.రేఖ

**స్టాఫ్ రిపోర్టర్స్**
కర్నాటి.సంజీవ్

**ఫొటోగ్రాఫర్**
డి.రవి

**రిపోర్టర్స్**
ప్రశాంత్
లింగస్వామి
భరత్
నికేష్
కార్తీక్

**REGD OFFICE ADDRESS**

Editor,Printer,Published,Owned by
**YELA.PURUSHOTHAM**
**H-NO : 11-21-890,Ntr Nagar,LB Nagar,Saroor Nagr Mandal,Rangareddy Dist,Telanagana State,India, Pin code-500074,Mobile -8247467562**

**HEAD OFFICE ADDRESS**

Editor,Printer,Published,Owned by
**YELA.PURUSHOTHAM**
**Plot no-31,H-No :1-13,Ganesh Nagar,Kuntloor,Abdullapurmettu (Mandal),Peddamberpet kalan,Near Hayath Nagar,Ranga Reddy-Dist,Telanagana State,India,Pincode-501505,Mobile: 8247467562**

**Email Id :nagaranijam@gmail.com**

**RNI NO : APTEL/2013/48919**
**GSTIN NO :36ABPPY8312D1ZA**
**PAN NO :ABPPY8312D**
**POSTAL REGD NO : HSE/1000/2024-2026**

## లోపల పేజీల్లో...

అర్హతే ప్రమాణం... రాజకీయాలకు స్థానం లేదు
ఇందిరమ్మ ఇళ్ల రెండో దశ త్వరలో మంజూరు

రంగారెడ్డి జిల్లా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ

నకిలీ విత్తనాల నిర్మూలనకు కఠిన చర్యలు


మహిళలు, పిల్లల భద్రత కోసం "స్పందన" బృందాల ప్రారంభం

అపోలో "ది హాస్పిటల్ ఆఫ్ గ్రాటిట్యూడ్" ప్రారంభం


జర్మనీ అవకాశాలపై దృష్టి విదేశీ ఉద్యోగాలకు నైపుణ్యాలు, భాషా శిక్షణ కీలకం

మా మాస పత్రికల్లో ప్రచురించిన,వివిధ డిపార్ట్మెంట్ల విభాగాలు, కొన్ని సేకరించిన విషయాలను, పాత జీవోలు, కొత్త జీవోలను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న జీవోలను, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం, భారత దేశ ప్రభుత్వం, కేంద్ర రాష్ట్రాల మంత్రిత్వ శాఖల, కేంద్ర ప్రభుత్వ జీవోలు, పత్రిక ప్రకటనలు,విభాగాలు , అధికారుల నుండి తీసుకున్న విషయాలను జోడించి ప్రచురించడం జరిగింది. అదేవిధంగా ఇంగ్లీష్ నుండి తెలుగులో తర్జుమా చేసిన కూడా కొన్ని పదాలును అర్థం చేసుకోవాలి.మా యొక్క అనుభవాలతో ప్రచురిస్తాం.దీనిపై ఎలాంటి ప్రచురించిన విషయంపై చర్చించాలంటే మాట్లాడాలంటే నగరనిజం తెలుగు మాస పత్రిక ఎడిటర్‌ను సంప్రదించగలరు.పత్రిక సంబంధించిన న్యాయపరమైన అంశాలన్నిటిని హైదరాబాద్, రంగారెడ్డి పరిధిలోని కోర్టులోనే పరిష్కరించుకోవాలి.

**YPS PUBLICATIONS**
PRINTED AT RATNA GRAPHICS, #2-3-703/7,Thirumala Nagar Colony, Opp Mro Office,Police Line,Amberpet,Hyderabad-500013 Ranga Reddy-Dist Telanaagna State,India



# సంపాదకీయం..




## భారతదేశంలో జంతువుల పరిరక్షణ

భారతదేశం ప్రపంచంలో అత్యంత సమృద్ధిగా జీవవైవిధ్యాన్ని కలిగిన దేశాలలో ఒకటి. హిమాలయాల నుండి సముద్రతీరాల వరకు విస్తరించిన భౌగోళిక వైవిధ్యం వల్ల ఇక్కడ అనేక రకాల జంతువులు, పక్షులు, సరీసృపాలు నివసిస్తున్నాయి. పులి భారతదేశ జాతీయ జంతువు కాగా, నెమలి జాతీయ పక్షిగా ప్రసిద్ధి చెందింది. గిర్ అడవుల్లో సింహాలు, కాజిరంగాలో ఖడ్గమృగాలు, దక్షిణ భారత అడవుల్లో ఏనుగులు విస్తారంగా కనిపిస్తాయి.

జంతువులు ప్రకృతి సమతుల్యతలో ముఖ్యమైన భాగం. ప్రతి జీవి ఆహార గొలుసులో ఒక క్రమాన్ని కొనసాగిస్తుంది. ఉదాహరణకు, మృగాలు గడ్డి తింటాయి, వాటిని మాంసాహార జంతువులు తింటాయి. ఈ చక్రం కొనసాగితేనే ప్రకృతి సమతుల్యం నిలుస్తుంది. ఒక జాతి అంతరించిపోతే ఆ ప్రభావం అనేక ఇతర జాతులపై పడుతుంది. అందువల్ల జంతువుల సంరక్షణ అనేది కేవలం వాటి కోసం కాకుండా మొత్తం పర్యావరణ రక్షణ కోసం అవసరం.

ప్రస్తుతం జంతువులు అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నాయి. అడవుల నరికి వేయడం వల్ల వాటి నివాస ప్రదేశాలు తగ్గిపోతున్నాయి. అక్రమ వేట, జంతు అవయవాల అక్రమ వ్యాపారం కూడా పెద్ద సమస్యగా ఉంది. వాతావరణ మార్పులు, నీటి కొరత, కాలుష్యం వంటి కారణాలు కూడా జంతువుల జీవనాన్ని ప్రభావితం చేస్తున్నాయి. పట్టణీకరణ పెరగడంతో మనుషులు అడవుల వైపు విస్తరిస్తుండటంతో మానవ–వన్యప్రాణి ఘర్షణలు కూడా పెరుగుతున్నాయి. ఈ సమస్యలను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోంది. దేశవ్యాప్తంగా జాతీయ ఉద్యానవనాలు, వన్యప్రాణి అభయారణ్యాలు, బయోస్ఫియర్ రిజర్వులు ఏర్పాటు చేయబడ్డాయి. ప్రాజెక్ట్ టైగర్, ప్రాజెక్ట్ ఎలిఫెంట్ వంటి ప్రత్యేక కార్యక్రమాల ద్వారా అరుదైన జంతువులను రక్షిస్తున్నారు. వన్యప్రాణి సంరక్షణ చట్టాల ద్వారా అక్రమ వేటపై కఠిన చర్యలు తీసుకుంటున్నారు. అటవీ విస్తరణ, పునర్వనీకరణ కార్యక్రమాలు కూడా అమలులో ఉన్నాయి.

అదేవిధంగా పలు స్వచ్ఛంద సంస్థలు కూడా జంతువుల పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, గాయపడిన జంతువులకు చికిత్స అందించడం, సంరక్షణపై పరిశోధనలు చేయడం వంటి పనులు చేస్తున్నాయి.

ప్రజల పాత్ర కూడా ఎంతో ముఖ్యమైనది. పర్యావరణాన్ని కాపాడటం, అడవులను నాశనం చేయకుండా ఉండటం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం వంటి చిన్నచిన్న చర్యలు కూడా జంతువుల సంరక్షణకు దోహదపడతాయి. పిల్లలకు చిన్నప్పటి నుంచే ప్రకృతి, వన్యప్రాణులపై ప్రేమ, బాధ్యతను నేర్పాలి. మొత్తానికి, జంతువుల పరిరక్షణ అనేది మన సమాజ భవిష్యత్తుతో నేరుగా సంబంధం కలిగిన విషయం. ప్రకృతిని కాపాడితేనే మన జీవితం సురక్షితం అవుతుంది. కాబట్టి ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి వన్యప్రాణుల సంరక్షణకు తమ వంతు సహకారం అందించాలి.





# అర్హతే ప్రమాణం... రాజకీయాలకు స్థానం లేదు
# ఇందిరమ్మ ఇళ్ల రెండో దశ త్వరలో మంజూరు




రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రజల సమస్యల పరిష్కారానికి వారు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా చేయడం ప్రజా ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. అధికారులు స్వయంగా ప్రజల వద్దకు వెళ్లి వినతులు స్వీకరించి, వెంటనే పరిష్కారం చూపుతున్నారని చెప్పారు. కుసుమంచి జిల్లా పరిషత్ హై స్కూల్ ప్రాంగణంలో నిర్వహించిన ప్రజా దర్బార్‌లో మంత్రి పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్, అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజతో కలిసి ప్రజల నుంచి నేరుగా వినతులు స్వీకరించారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పారదర్శక పాలనను ఇంటింటికీ తీసుకెళ్లామని, ప్రతి వినతిని జాగ్రత్తగా పరిశీలించి తక్షణ చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

పాలేరు నియోజకవర్గంలో మండలాలను క్లస్టర్లుగా విభజించి ప్రజా దర్బార్‌లు నిర్వహిస్తున్నామని, అర్హులైన ప్రతి దరఖాస్తును రాజకీయ భేదాలు లేకుండా పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. సదాబైనామా, నిషేధిత భూముల జాబితా, భూ రికార్డుల సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు. 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక ద్వారా సంక్షేమ పథకాలను మరింత సమర్థవంతంగా అమలు చేస్తున్నామని తెలిపారు.

ప్రజా దర్బార్‌లలో ఎక్కువగా ఇందిరమ్మ ఇళ్ల కోసం వినతులు వస్తున్నాయని పేర్కొంటూ, ఇళ్ల నిర్మాణానికి సంబంధించిన నిధులను ప్రతి సోమవారం లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తున్నామని చెప్పారు. మే నెలాఖరులోగా ఇందిరమ్మ ఇళ్ల రెండో దశ మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.

అలాగే రైతులకు కనీస మద్దతు ధరపై వరి, మొక్కజొన్న పంటలను కొనుగోలు చేస్తున్నామని, వారంలోపే చెల్లింపులు వారి ఖాతాల్లో జమ చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే 25 లక్షల మంది రైతులకు రుణమాఫీ అమలు చేశామని, రైతు భరోసా ను ఎకరాకు 12,000కు పెంచామని, సన్న బియ్యానికి క్వింటాల్‌కు 500 బోనస్ ఇస్తున్నామని చెప్పారు. మే 5 నుంచి 7 వరకు వ్యవసాయ పరికరాల సబ్సిడీ పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్లడించారు.



# నిజామాబాద్‌లో 'మిషన్ అపరాజిత' ప్రారంభం
# గృహ హింస బాధిత మహిళలకు
# చేరువైన న్యాయం




హింసను ఎదుర్కొంటున్న మహిళలకు భయం, మౌనం, అపోహల మధ్య కాకుండా గౌరవప్రదంగా న్యాయం అందించేందుకు నిజామాబాద్ జిల్లాలో 'మిషన్ అపరాజిత' కార్యక్రమం ప్రారంభమైంది. మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు ఈ కార్యక్రమం ఒక సమగ్ర దారిని చూపుతోంది. జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆధ్వర్యంలో ప్రారంభమైన ఈ కార్యక్రమానికి జిల్లా ప్రధాన న్యాయమూర్తి భాగ్యలక్ష్మి, ఆర్మూర్ కోర్టు న్యాయమూర్తి శ్రీదేవి మద్దతు అందించారు. ప్రజా వినతుల సమయంలో మహిళలు వ్యక్తం చేసిన అనుభవాలను పరిగణలోకి తీసుకొని ఈ కార్యక్రమాన్ని రూపొందించారు.

ఈ కార్యక్రమం ముఖ్యంగా అవగాహనపై దృష్టి సారించింది. గృహ హింస అనేది కేవలం శారీరక దాడులు మాత్రమే కాకుండా భావోద్వేగ, మానసిక, ఆర్థిక హింసలను కూడా కలిగి ఉంటుందని మహిళలకు వివరించబడుతోంది. బాధితులకు సహాయం అందించే కేంద్రాల గురించి కూడా తెలియజేస్తున్నారు. ముఖ్యంగా సఖి వన్ స్టాప్ సెంటర్ ద్వారా మహిళలకు సురక్షిత వాతావరణంలో సహాయం అందుతోంది.


మహిళలు న్యాయ సహాయం పొందేందుకు ఖర్చు లేకుండా మార్గదర్శకత్వం కల్పించడం ఈ కార్యక్రమం ప్రత్యేకత. జిల్లా రక్షణ అధికారి ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ ద్వారా సమస్యలను పరిష్కరించే ప్రయత్నం జరుగుతుంది. సామరస్యానికి అవకాశం లేకపోతే న్యాయ ప్రక్రియను ఆలస్యం లేకుండా కొనసాగించే విధంగా చర్యలు తీసుకుంటున్నారు.

నిందితులు విచారణకు హాజరుకాకపోతే ఎక్స్ పార్టీ ఆదేశాలు, నాన్ బెయిలబుల్ వారెంట్లు జారీ చేయడం ద్వారా బాధ్యతను కట్టుదిట్టం చేస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగులు నిందితులుగా ఉన్న సందర్భాల్లో వేతనాలను నిలిపివేయడం వంటి పరిపాలనా చర్యలు కూడా అమలు చేస్తున్నారు.

విదేశాలకు వెళ్లి కేసులను తప్పించుకునే ప్రయత్నాలను అరికట్టేందుకు న్యాయపరమైన మార్గాలపై చర్చలు కొనసాగుతున్నాయి. ఈ చర్యలు వ్యవస్థలో ఉన్న లోపాలను ముందుగానే గుర్తించి పరిష్కరించేందుకు ప్రయత్నంగా భావిస్తున్నారు. అదనంగా, ప్రత్యేక గృహ హింస న్యాయస్థానం ఏర్పాటు ప్రతిపాదన కూడా ముందుకు తీసుకువచ్చారు. గ్రామాలు, కార్యాలయాల స్థాయిలో ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తూ "న్యాయం అందుబాటులో ఉంది, మద్దతు ఉంది, మౌనం అవసరం లేదు" అనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు.



# ఎన్ఎండీసీ ఆర్థిక సంవత్సరం 27ను 16 శాతం వృద్ధితో ప్రారంభించింది



దేశంలోని ప్రముఖ గనుల సంస్థ ఎన్ఎండీసీ ఆర్థిక సంవత్సరం 27 తొలి నెలలోనే గణనీయమైన వృద్ధిని నమోదు చేసింది. 2026 ఏప్రిల్ నెలలో సంస్థ 46.4 లక్షల టన్నుల ఇనుము ఖనిజాన్ని ఉత్పత్తి చేయగా, 36.8 లక్షల టన్నుల విక్రయాలు నమోదు చేసింది.

గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఉత్పత్తిలో 16 శాతం వృద్ధి సాధించినట్లు సంస్థ వెల్లడించింది. బైలడిలా గనుల ప్రాజెక్టుల్లో అత్యుత్తమ పనితీరు కారణంగా ఈసారి ఏప్రిల్ నెలలోనే సంస్థ చరిత్రలో అత్యధిక ఉత్పత్తి నమోదైంది.

గత నాలుగేళ్లలో దేశంలో ఇనుము ఖనిజ ఉత్పత్తి సగటు వార్షిక వృద్ధి రేటు 3.9 శాతంగా ఉండగా, ఎన్ఎండీసీ మాత్రం 6.8 శాతం వృద్ధిని సాధించి పరిశ్రమ కంటే ముందంజలో నిలిచింది. దీంతో సంస్థ వాటా కూడా పెరిగినట్లు సమాచారం.

సంస్థ సామర్థ్యాల విస్తరణ వేగంగా జరుగుతోందని, రవాణా వ్యవస్థ, మౌలిక సదుపాయాలు, సాంకేతికత, సరఫరా వ్యవస్థలపై ఇప్పటికే బలమైన పునాది ఏర్పాటుచేసినట్లు సీఎండీ అమితావ ముఖర్జీ తెలిపారు. ఏప్రిల్‌లో 4.6 మిలియన్ టన్నులతో ప్రారంభమైన ఉత్పత్తిని ఈ ఆర్థిక సంవత్సరంలో 60 మిలియన్ టన్నులకు పైగా తీసుకెళ్లడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొన్నారు.

2025-26 ఆర్థిక సంవత్సరంలో 53 మిలియన్ టన్నులకుపైగా ఉత్పత్తి సాధించిన ఎన్ఎండీసీ, తాజా ఫలితాలతో దేశంలోని ఇనుము, ఉక్కు రంగాలపై ఆశాజనక సంకేతాలను ఇస్తోంది.



# ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో మహేశ్వరం స్థాయి సమావేశం




రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగుతున్న 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మహేశ్వరం నియోజకవర్గ స్థాయి సమావేశం కాకి ఈశ్వర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ సమావేశానికి టీయూఎఫ్ఐడీసీ ఛైర్మన్ చల్లా నర్సింహారెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

కార్యక్రమం ప్రారంభంలో తెలంగాణ గీతాన్ని ఆలపించి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రసంగాన్ని చదివి వినిపించారు. అనంతరం ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాల ద్వారా లబ్ధి పొందుతున్న వారి వివరాలను సభలో వెల్లడించారు.

ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రస్థానంలో నిలపాలనే లక్ష్యంతో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికను చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను పకడ్బందీగా అమలు చేస్తూ ప్రతి కుటుంబానికి ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. గ్యారంటీ పథకాలతో పాటు కొత్త రేషన్ కార్డుల ద్వారా సన్నబియ్యం పంపిణీ జరుగుతోందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్లు అందించడం ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. మహిళా సాధికారతకు ప్రాధాన్యత ఇస్తూ వారిని ఆర్థికంగా బలోపేతం చేసే చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ప్రతి అర్హుడికి చేరేలా కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నామని తెలిపారు. గ్రామ స్థాయిలోనే సమస్యలను గుర్తించి తక్షణమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. తాగునీరు, రహదారులు, పారిశుద్ధ్యం, విద్య, వైద్య సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. రైతు భరోసా, గృహ జ్యోతి, మహాలక్ష్మి పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో కందుకూర్ ఆర్డీఓ జగదీశ్వర్ రెడ్డి, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# మేడ్చల్ కోర్టు ప్రాంగణంలో నూతన జిల్లా సెషన్ కోర్టు హాల్ ప్రారంభం



మేడ్చల్ జిల్లా కోర్టు ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన జిల్లా సెషన్ కోర్టు హాల్ ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు, జిల్లా ఉన్నతాధికారులు హాజరయ్యారు. నూతన కోర్టు హాల్‌ను జస్టిస్ కె. లక్ష్మణ్, జస్టిస్ బి. విజయ్ సేన్ రెడ్డి, జస్టిస్ నందికొండ నర్సింగరావు, జిల్లా కలెక్టర్ మను చౌదరి కలిసి రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. కార్యక్రమం ప్రారంభంలో జ్యోతి ప్రజ్వలన నిర్వహించి సంప్రదాయబద్ధంగా వేడుకను ప్రారంభించారు. అనంతరం కోర్టు హాల్‌లో ఏర్పాటు చేసిన సౌకర్యాలు, న్యాయమూర్తుల ఛాంబర్లు పరిశీలించారు. పెరుగుతున్న కేసుల దృష్ట్యా కక్షిదారులు, న్యాయవాదులకు మెరుగైన వసతులు అందించడమే లక్ష్యంగా ఈ నూతన కోర్టు హాల్‌ను నిర్మించినట్లు అధికారులు తెలిపారు. న్యాయ ప్రక్రియ వేగవంతం కావడానికి ఇది ఉపయోగపడుతుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయాధికారులు, బార్ అసోసియేషన్ ప్రతినిధులు, పోలీసు అధికారులు, కోర్టు సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# పిల్లల ఎదుగుదలపై తల్లిదండ్రులు నిరంతరం దృష్టి పెట్టాలని, వారి ప్రవర్తనను సమీక్షిస్తూ సరికొత్త సవాళ్ల నుంచి రక్షించాలని జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్మయి




పిల్లల ఎదుగుదలపై తల్లిదండ్రులు నిరంతరం దృష్టి పెట్టాలని, వారి ప్రవర్తనను సమీక్షిస్తూ సరికొత్త సవాళ్ల నుంచి రక్షించాలని జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్మయి సూచించారు.

రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ లోని రెడ్ రోజ్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన 99 రోజుల ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక నియోజకవర్గ స్థాయి సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్మయి, స్థానిక శాసన సభ్యులు వీర్లపల్లి శంకర్ తో కలిసి ముఖ్య అతిధిగా పాల్గొన్నారు.

కార్యక్రమాన్ని రాష్ట్ర గీతంతో ప్రారంభించి, రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి సందేశాన్ని వినిపించారు. వివిధ శాఖల అధికారులు తమ శాఖలకు సంబంధించిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. సభలో ఏర్పాటు చేసిన వివిధ శాఖలకు సంబంధించిన స్టాల్ లు ముఖ్య అతిధులు సందర్శించారు.

ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్మయి మాట్లాడుతూ పిల్లలను సెల్‌ఫోన్లకు అతుక్కుపోకుండా నియంత్రిస్తూ, వారి భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా 14 సంవత్సరాలు దాటిన బాలికలకు గర్భాశయ క్యాన్సర్ నివారణలో భాగంగా హెచ్ పివి (హ్యూ) టీకా తప్పనిసరిగా వేయించాలన్నారు. ఈ టీకా సురక్షితమై, దీర్ఘకాలిక రక్షణను అందిస్తుందని తెలిపారు. మహిళల ఆర్థిక స్వావలంబనకు ప్రభుత్వం వడ్డీ లేని రుణాలు అందిస్తూ సహకరిస్తోందని, మహిళా సంఘాలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధి వైపు అడుగులు వేయాలని సూచించారు. కుటీర పరిశ్రమల ద్వారా మహిళలు ఆర్థికంగా బలపడేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని వివరించారు. సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

సైబర్ క్రైమ్‌లు రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని కిరణ్మయి హెచ్చరించారు. అనుమానాస్పద లింకులు, ఓటీపీలు పంచుకోవద్దని, మోసపోయినట్లయితే వెంటనే 1930 లేదా 1908 నంబర్లకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ట్రాఫిక్ నియమాలు పాటించాలని, రోడ్డు ప్రమాదాల నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొంటూ, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారుదారులు సీట్‌బెల్ట్ తప్పనిసరిగా ఉపయోగించాలని, మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని, మద్యం సేవించి వాహనాలు నడపడం ప్రమాదకరమని హెచ్చరించారు.

శాసన సభ్యులు వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ విద్యకు అత్యంత ప్రాధాన్యతనిస్తున్న ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమని అన్నారు. ప్రతి నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ పాఠశాలల ఏర్పాటుతో విద్యా ప్రమాణాలు మెరుగుపడుతున్నాయని పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో విద్యా వ్యవస్థలో మార్పులు చోటుచేసుకున్నాయని తెలిపారు. మహిళల సంక్షేమానికి ఉచిత బస్సు సౌకర్యం, గృహజ్యోతి ద్వారా ఉచిత విద్యుత్, తక్కువ ధరలో గ్యాస్ సిలిండర్, రైతులకు రైతు భరోసా, పెన్షన్లు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు వంటి పథకాలు అమలు చేస్తున్నట్లు వివరించారు. ఇందిరమ్మ ఇళ్ల పంపిణీతో పేదల జీవితాల్లో వెలుగు నింపుతున్నామని అన్నారు.

ఈ కార్యక్రమంలో మహిళా సంఘాలకు రూ.238 కోట్లకు పైగా వడ్డీ లేని రుణాలను పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో షాద్ నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూరి బస్వాం, వైస్ చైర్మన్ అందే మోహన్ మార్కెట్ కమిటీ చైర్మన్ సులోచన కృష్ణారెడ్డి, షాద్ నగర్ ఏసిపి లక్ష్మీనారాయణ మున్సిపల్ కమిషనర్ సునీత, మండల విద్యాధికారి మనోహర్, ఫరూక్ నగర్ మండల తాహసిల్దార్ నాగయ్య ఎంపీడీవో బన్సీలాల్ అధికారులు వివిధ గ్రామాల సర్పంచులు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# రంగారెడ్డి జిల్లా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ



రంగారెడ్డి జిల్లా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణను పక్కద్భందీగా అమలు చేయాలని రాష్ట్ర వ్యవసాయ, సహకార, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు అన్నారు.

హైదరాబాద్ నుండి రాష్ట్ర నీటిపారుదల, పవర్ సరఫరాల శాఖమంత్రి ఉత్తంకుమార్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులతో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యాచరణ అమలు, నీట్ పరీక్ష నిర్వహణ, ధాన్యం కొనుగోలు, ప్రజావాణి అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన ప్రజావాణి ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణను పకడ్బందీగా అమలు చేయాలని తెలిపారు. ఈ నేపథ్యంలో ఈ నెల 4వ తేదీ నుండి 9వ తేదీ వరకు రైతు వారోత్సవాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. రైతులకు శాస్త్రీయ పద్ధతులపై అవగాహన కల్పించడం, వ్యవసాయ ఉత్పత్తి పెంపు, ప్రభుత్వ పథకాల వినియోగాన్ని విస్తరించడం లక్ష్యంగా నిర్దేశించడం జరిగిందని తెలిపారు. 4వ తేదీన జిల్లాలోని వివిధ ప్రాంతాలలో నేల నమూనాల సేకరణ చేపట్టి, వాటిని పరీక్షించి రైతులకు వారి భూమికి అనుకూలమైన పంటలను ఎంపిక చేసుకునేందుకు మార్గదర్శకాలు అందించాలని, రైతు నమోదు చేపట్టాలని తెలిపారు. 5వ తేదీన





ఉద్యాన పంటల ప్రోత్సాహం, నూనె గింజల పంటల సాగు విస్తీర్ణాన్ని పెంచే చర్యలపై రైతులకు అవగాహన కల్పించాలని, విభిన్న పంటలను సాగు చేయడం ద్వారా ఆదాయం పెంపుపై దృష్టి సాధించేలా రైతులను ప్రోత్సహించాలని తెలిపారు. 6వ తేదీన రైతులకు తక్షణ, దీర్ఘకాలిక పంట రుణాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో మౌలిక సదుపాయాలు, కనీస మద్దతు ధర విధానం, మార్కెట్ కమిటీ వినియోగంపై రైతులకు వివరించాలని, 7వ తేదీన ఆధునిక వ్యవసాయ పద్ధతులలో భాగంగా వ్యవసాయ డ్రోన్ ప్రదర్శనలు, విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి కుసుమ్ పథకంపై రైతులకు వివరించి, సౌర శక్తి వినియోగంపై అవగాహన పెంపొందించాలని తెలిపారు. 8వ తేదీన పశుసంవర్ధక, మత్స్యశాఖల ఆధ్వర్యంలో పశువుల జాతి మెరుగుదల, చేపల ఉత్పత్తి పెంపు, వేసవి కాలంలో పశువుల సంరక్షణపై రైతులకు అవసరమైన సూచనలు అందించాలని, 9వ తేదీన నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో కాలువల శుభ్రపరిచే కార్యక్రమాలు, పొదల తొలగింపు, అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించే విధానాలపై చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు.

రాబోయే సీజన్‌లో ధాన్యం ఉత్పత్తి అంచనా సుమారు 141 లక్షల మెట్రిక్ టన్నులుగా ఉండగా ప్రభుత్వం 90 లక్ష మెట్రిక్ టన్నుల కొనుగోలు లక్ష్యాన్ని నిర్ణయించిందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 8 వేల 575 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు జరుగగా, ఇప్పటి వరకు కనీస మద్దతు ధర కింద రైతులకు 581 కోట్ల 72 లక్షల రూపాయల చెల్లింపులు జరిగాయని తెలిపారు. ధాన్యం సేకరణ లక్ష్యాన్ని సాధించేందుకు ట్యాబ్ ఎంట్రీలు, రవాణా, కార్మికుల అందుబాటు, గోనె సంచుల సరఫరా, హార్వెస్టర్ యంత్రాల వినియోగం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సాధించాలని, వాతావరణ పరిస్థితులను పరిశీలిస్తూ సకాలంలో ధాన్యం సేకరణ జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలలోని రైస్ మిల్లుల సామర్థ్యం, మొక్కజొన్న కొనుగోళ్ల పరిస్థితులపై సమీక్షించి, ధాన్యం కొనుగోలు ప్రక్రియ నిరాటంకంగా కొనసాగేందుకు ఆయా జిల్లాల కలెక్టర్లు సమన్వయం చేసుకుంటూ అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు.

ఉపాధి హామీ పథకం కింద కూలీల సమీకరణను మరింత బలోపేతం చేయాలని, పనితీరు తక్కువగా ఉన్న మండలాలు, గ్రామ పంచాయతీలను ప్రత్యక్షంగా సందర్శించి పర్యవేక్షణ చేపట్టి, లక్ష్య సాధన దిశగా సమగ్ర కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. నమోదు చేసిన అన్ని క్రియాశీల కూలీలకు ఉపాధి కల్పించడం, ప్రతి నివాస ప్రాంతంలో పనులు ప్రారంభించడం, వేసవి దృష్ట్యా ప్రతి పని ప్రదేశంలో నీడ, తాగునీరు, ప్రథమ చికిత్స వంటి మౌలిక సదుపాయాలు తప్పనిసరిగా కల్పించాలని తెలిపారు. ప్రతి గ్రామ పంచాయతీ పనుల జాబితాలో కనీసం 20 కూలీ ఆధారిత పనులు ఉండేలా చూడాలని, ప్రతి 40 మంది కూలీలకు ఒక మేట్‌ను నియమించి పర్యవేక్షణను బలోపేతం చేయాలని తెలిపారు. కూలీల హాజరు, పనితీరు మెరుగుపర్చడానికి ప్రతి మండలానికి ప్రత్యేక అధికారులను నియమించి, పర్యవేక్షణ చేపట్టాలని తెలిపారు. గ్రామపంచాయతీ స్థాయిలో సర్పంచ్ సమక్షంలో క్రియాశీల కూలీలతో సమావేశాలు నిర్వహించి, ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈ చర్యల ద్వారా ఉపాధి హామీ పథకం సమర్థవంతంగా అమలై, గ్రామీణ కూలీలకు స్థిరమైన ఉపాధి లభిస్తుందని తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారం కొరకు నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని రెవెన్యూ డివిజన్ స్థాయిలో నోడల్ అధికారిగా రాజస్వ మండల అధికారిని నియమించి ప్రజావాణి కార్యక్రమ నిర్వహణకు చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో దరఖాస్తు స్వీకరించిన 30 రోజులలోగా పరిష్కరించాలని, లేనిపక్షంలో తిరస్కరణ, అందుకు గల కారణాలతో దరఖాసుదారులకు సమాచారం అందించాలని తెలిపారు. ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తుల సంబంధిత వివరాలను పోర్టల్ లో నమోదు చేసి రసీదు అందించాలని, దరఖాస్తుదారులు ప్రజావాణి




పోర్టల్ లో తమ దరఖాస్తు స్థితిని తెలుసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తులు సమర్పించడానికి వచ్చే ప్రజలకు త్రాగునీరు, కుర్చీలు, అత్యవసర వైద్య సేవలను అందుబాటులో ఉంచాలని తెలిపారు.

ఈ నెల 3వ రాష్ట్ర వ్యాప్తంగా జరగనున్న నీట్ పరీక్ష నిర్వహణను పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 1.30 గంటల వరకు జరగనున్న నీట్ పరీక్షకు అభ్యర్థుల హాజరును బయోమెట్రిక్ విధానం ద్వారా తీసుకోవడం జరుగుతుందని, పరీక్ష కేంద్రంలోనికి ఎలాంటి డిజిటల్ పరికరాలు అనుమతించడం జరగదని, పరీక్ష రాసే అభ్యర్థుల తనిఖీ సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. ప్రశ్నపత్రాల రవాణాపై పోలీస్, రెవెన్యూ, తపాలా శాఖల అధికారుల సమన్వయంతో రక్షణ చర్యలు చేపట్టాలని, పరీక్ష కేంద్రాల వద్ద నిబంధనల ప్రకారం బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కంట్రోల్ రూమ్, పరీక్ష కేంద్రాలలో సి.సి. కెమెరాలు ఏర్పాటు చేయాలని, పరీక్ష ముగిసిన తరువాత ఓ.ఎం.ఆర్. పత్రాల తరలింపు నిబంధనల ప్రకారం పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. పరీక్షా సమయంలో ఎలాంటి అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా, వైద్య-ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్య సిబ్బందిని నియమించి, ఓ.ఆర్.ఎస్., అవసరమైన మందులు అందుబాటులో ఉంచడం జరుగుతుందని తెలిపారు. దివ్యాంగ అభ్యర్థుల కొరకు సౌకర్యాలు కల్పించాలని తెలిపారు.

జనగణన అధికారి భారతి హోళ్ళికేరి మాట్లాడుతూ జనగణన -2027లో భాగంగా మొదటి విడతలో మే 11వ తేదీ నుండి జూన్ 9వ తేదీ వరకు ఇండ్ల గడన చేపట్టడం జరుగుతుందని, ఈ క్రమంలో ఈ నెల 10వ తేదీ వరకు జరగనున్న స్వీయ గణన కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని తెలిపారు. ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లకు శిక్షణ అందించడం జరుగుతుందని, ఇందుకుగాను అవసరమైన సామాగ్రి పూర్తిస్థాయిలో అందుబాటులో ఉందని, 95 శాతం కేటాయించిన ప్రకారంగా అందించడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు, యువత స్వీయ గణన చేసుకునేలా అవగాహన కల్పించాలని, టామ్ టామ్, దినపత్రికలు, ఛానల్ ద్వారా ప్రజలందరికీ తెలిసే విధంగా విస్తృత ప్రచారం చేపట్టాలని తెలిపారు. 33 ప్రశ్నలకు సరైన సమాధానం అందించాలని, స్వీయ గణన ప్రక్రియ అనంతరం వచ్చిన సంఖ్యను భద్రపరచుకుని గణన అధికారులు ఇంటికి వచ్చిన సమయంలో అందించేలా ప్రజలకు వివరించాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ఆదనపు కలెక్టర్లు చంద్రారెడ్డి, కిరణ్మయి, జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీలత, పిడి మెప్మా వెంకట నారాయణ, సిపిఓ సౌమ్య, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉషా, ఉద్యానవన శాఖ అధికారి సురేష్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి వనజాత, సంక్షేమ శాఖ అధికారులు రామేశ్వరి దేవి, పద్మావతి, నవీన్ కుమార్ రెడ్డి, డిఈఓ సుసిందర్ రావు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# నకిలీ విత్తనాల నిర్మూలనకు కఠిన చర్యలు

# జిల్లా టాస్క్ ఫోర్స్ కీలక నిర్ణయాలు




రంగారెడ్డి జిల్లాలో నకిలీ విత్తనాల విక్రయాలను పూర్తిగా అరికట్టేందుకు జిల్లా స్థాయిలో టాస్క్ ఫోర్స్ సమావేశం నిర్వహించారు. నకిలీ విత్తనాల రహిత రాష్ట్రం లక్ష్యంగా ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

వ్యవసాయ శాఖ, పోలీసు శాఖ, విత్తన సంస్థలు, రవాణా శాఖల సమన్వయంతో ప్రత్యేక టాస్క్ ఫోర్స్ బృందాలు ఏర్పాటు చేశారు. జిల్లాలో 3 జిల్లా స్థాయి బృందాలు, 6 విభాగ స్థాయి బృందాలు, 26 మండల స్థాయి బృందాలు పనిచేస్తున్నట్లు వెల్లడించారు.

జిల్లాలో ప్రస్తుతం 474 రిటైల్ విత్తన దుకాణాలు, 9 విత్తన ప్రాసెసింగ్ యూనిట్లు, 224 లైసెన్సు కలిగిన విత్తన హోల్డర్లు ఉన్నారు. ముఖ్యంగా పత్తి, మిర్చి పంటల్లో నకిలీ విత్తనాల సమస్య అధికంగా ఉండటంతో సీజన్ మొత్తం కఠిన తనిఖీలు చేపట్టాలని నిర్ణయించారు.

లైసెన్సు లేని సంస్థలు తయారు చేసినవి, అనధికారికంగా విక్రయించినవి, సరైన లేబులింగ్ లేని ప్యాకెట్లు, గడువు ముగిసినవి, తక్కువ నాణ్యత గలవి అన్నీ నకిలీ విత్తనాలుగా పరిగణిస్తారని తెలిపారు.

ఈ సమస్య నివారణకు టాస్క్ ఫోర్స్ బృందాల ద్వారా నిరంతర తనిఖీలు, విత్తన నమూనాల సేకరణ, పరీక్షలు నిర్వహించనున్నారు. సరిహద్దుల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, నిందితులపై భారతీయ శిక్షాస్మృతి 420, ఈసీ చట్టం 1955, విత్తన చట్టం ప్రకారం కేసులు నమోదు చేయనున్నారు.

రైతులకు అవగాహన కల్పించేందుకు లైసెన్సు ఉన్న దుకాణాల నుంచే విత్తనాలు కొనుగోలు చేయాలని, తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలని సూచించారు. అనధికారిక విక్రేతల వద్ద కొనుగోలు చేయవద్దని హెచ్చరించారు. రైతు వేదికల ద్వారా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

హెర్బిసైడ్ టాలరెంట్ పత్తి విత్తనాలపై కూడా సమావేశంలో చర్చించారు. కేంద్ర ప్రభుత్వం ఆమోదం లేని జన్యుమార్పిడి విత్తనాల సాగు చట్ట విరుద్ధమని, పర్యావరణ పరిరక్షణ చట్టం 1986 ప్రకారం శిక్షలు ఉంటాయని తెలిపారు. గ్లైఫోసేట్ వంటి రసాయనాల వినియోగం ఆరోగ్యానికి, పర్యావరణానికి హానికరమని హెచ్చరించారు.

నకిలీ విత్తనాల నిర్మూలనలో కఠిన చర్యలతో పాటు రైతుల సహకారం అత్యంత అవసరమని అధికారులు పేర్కొన్నారు.



# మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా స్థాయిలో ప్రజా ప్రభుత్వం కార్యక్రమం



మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా స్థాయిలో ప్రజా ప్రభుత్వం కార్యక్రమం మరియు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల భాగంగా జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 01-మే-2026 రోజున కుత్బుల్లాపూర్ ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ హాస్పిటల్ మల్కాజిగిరి లో గల బాల భరోసా స్క్రీనింగ్ సెంటర్ ను ఆవిష్కరించిన జిల్లా అదనపు కలెక్టర్ జిల్లా కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ మీదుగా ప్రారంభించారు. వారు మాట్లాడుతూ, 0-5 సంవత్సరాల పిల్లలకు పెరుగుదల లోపాలు మూగ, చెవిటి, మాటలు రాకపోవడం వంటి వైకల్యాల గుర్తింపు బాల భరోసా ద్వారా మెడికల్ సహాయం అందిస్తున్నట్లు,చిన్నారుల ఆరోగ్య రక్షణ కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రారంభించిన "బాల భరోసా" పథకం ప్రభుత్వ ఆసుపత్రుల్లో అమలు అవుతోంది. ఈ పథకం కింద ఐదేళ్లలోపు పిల్లలకు ఉచిత వైద్య పరీక్షలు, చికిత్సలు అందిస్తున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పిల్లల ఆరోగ్య పరిస్థితిని పరిశీలించి, అవసరమైతే వారిని ఆసుపత్రులకు రిఫర్ చేస్తున్నారు. ప్రత్యేక వైద్య బృందాలు పిల్లల్లో న్యూరో డెవలప్మెంట్ సమస్యలు, వికలాంగత లక్షణాలను ముందుగానే గుర్తించి చికిత్స అందిస్తున్నాయి. పిల్లల ఆరోగ్యం మన బాధ్యత వారి భవిష్యత్తు మనపై ఆధారపడి ఉందని తెలియజేశారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రత్యేక వైద్య బృందాలు ఏర్పాటు చేసి, పిల్లలకు అవసరమైన పరీక్షలు, మందులు, శస్త్రచికిత్సలు ఉచితంగా అందిస్తున్నారు. ఈ పథకం కింద చిన్నారులకు న్యూరో డెవలప్మెంట్ సమస్యలు, వికలాంగత లక్షణాలు వంటి సమస్యలను ముందుగానే గుర్తించి చికిత్స అందిస్తున్నారు.

జిల్లా సంక్షేమ అధికారి శారద మాట్లాడుతూ, ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమం ద్వారా చిన్నారుల ఆరోగ్యం మెరుగుపడి, భవిష్యత్తులో ఆరోగ్యవంతమైన సమాజం నిర్మాణానికి దోహదపడుతుందని అధికారులు తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పిల్లల ఆరోగ్య పరిస్థితిని పరిశీలించి, అవసరమైతే వారిని ఆసుపత్రులకు రిఫర్ చేస్తున్నారు. ప్రత్యేక వైద్య బృందాలు పిల్లల్లో న్యూరో డెవలప్మెంట్ సమస్యలు, వికలాంగత లక్షణాలను ముందుగానే గుర్తించి చికిత్స అందిస్తున్నాయి అని తెలియజేశారు. గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ సూపరిండెంట్ రాధా మాట్లాడుతూ, పిల్లలకు మెరుగైన వైద్యం అందిస్తామని,పిల్లలు ఆరోగ్యంగా, సురక్షితంగా, విద్యతో ముందుకు సాగేందుకు బలమైన ఆధారం అందిస్తుంది. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఉమా గౌరీ మాట్లాడుతూ, పిల్లలకు

పోషకాహారం అందించటం ద్వారా పిల్లల ఆరోగ్యం మెరుగుపడుతుందని, పిల్లల సంక్షేమం, భద్రత, మరియు అభివృద్ధి కోసం రూపొందించిన ముఖ్యమైన ప్రభుత్వ పథకం, బాల భరోసా అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గవర్నమెంట్ మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ మహాలక్ష్మి, సివిల్ సర్జన్ ఆర్ఎంవో శోభ, డిప్యూటీ డిఎం అండ్ హెచ్ ఓ లావణ్య , అల్వాల్ సిడిపిఓ స్వాతి, బాల రక్ష భవన్ కోఆర్డినేటర్ తిరుమల దేవి, జిల్లా బాలల పరిరక్షణ అధికారి ఇంతియాజ్ రహీం,ఆశా వర్కర్స్ , ఐసిడిఎస్ సూపర్వైజర్స్, అంగన్వాడి టీచర్స్, తల్లులు పిల్లలు, జిల్లా బాలల పరిరక్షణ విభాగం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఘనంగా మే డే వేడుకలు



మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో అంతర్జాతీయ కార్మిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సమాజ నిర్మాణంలో కార్మికుల సేవలను స్మరించుకుంటూ వారి కృషికి గౌరవం తెలిపారు.

జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ మిక్కిలినేని మనూ చౌదరి ఈ సందర్భంగా కార్మికులకు శుభాకాంక్షలు తెలియజేశారు. అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఫైజాన్ అహ్మద్ మాట్లాడుతూ కార్మికుల కృషి దేశ ఆర్థికాభివృద్ధికి పునాది అని పేర్కొన్నారు. కార్మికుల హక్కుల పరిరక్షణ, న్యాయమైన వేతనాలు, సురక్షితమైన పనివాతావరణం కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని వివరించారు. అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డి. విజయేందర్ రెడ్డి కార్మిక సంక్షేమ పథకాల సమర్థవంతమైన అమలు ద్వారా వారి జీవన స్థితిగతులను మెరుగుపరచడం ముఖ్యమని అన్నారు.

ఈ సందర్భంగా ఉత్తమ ఉద్యోగులను సన్మానించారు. అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ అంజనేయులు, ఈఎస్ఐ విభాగానికి చెందిన కనక దుర్గాదేవి, ఐటీఐ మెడ్చల్ ప్రిన్సిపాల్ హనుమా నాయక్, డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ మనోహర్ రెడ్డిని ప్రశంసించారు. బాల కార్మికత్వం నుండి రక్షించబడి ప్రస్తుతం విద్యను అభ్యసిస్తున్న మీనాను "ఉత్తమ బాల సర్వైవర్"గా గుర్తించి సత్కరించారు. ఆమె పట్టుదలను అధికారులు అభినందించారు.

అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ లక్ష్మీపతి కార్మిక సంక్షేమ పథకాలపై అవగాహన అవసరాన్ని వివరించారు. ఎంప్లాయ్మెంట్ ఆఫీసర్ రాధిక నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాల పెంపుపై దృష్టి పెట్టాలని సూచించారు.

కార్యక్రమంలో అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్లు సాయి సుమన్ పి., అంజనేయులు కార్మిక చట్టాలు, ఉద్యోగుల హక్కులపై వివరణ ఇచ్చారు. కార్మికులు తమ హక్కులపై అవగాహన కలిగి ఉండడం అవసరమని తెలిపారు. జిల్లాలో కార్మికులకు అవగాహన కల్పించేందుకు మే 02 నుండి మే 10 వరకు ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ శిబిరాల్లో కార్మిక చట్టాలు, భద్రతా ప్రమాణాలు, సంక్షేమ పథకాలపై విస్తృతంగా అవగాహన కల్పించనున్నారు.

# పోక్సో కేసులో తండ్రికి 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష



జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన పోక్సో కేసులో నిందితుడు అస్గర్ అలీకి కోర్టు 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధించింది. రూ.35,000 జరిమానా విధిస్తూ, బాధితురాలికి రూ.3 లక్షల పరిహారం చెల్లించాలని ఆదేశాలు జారీ చేసింది.

పోలీసుల వివరాల ప్రకారం, గంపాలబస్తీ, సుభాష్ నగర్, ఐడీఏ జీడిమెట్లకు చెందిన అస్గర్ అలీ (37) కూలీగా పని చేస్తూ కుటుంబంతో కలిసి నివసిస్తున్నాడు. 2019లో ఉపాధి కోసం హైదరాబాద్‌కు వచ్చిన ఈ కుటుంబంలో ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. తల్లి గృహ పనులు చేస్తుండగా, నిందితుడు మద్యానికి అలవాటు పడి కుటుంబంపై తరచూ హింసకు పాల్పడేవాడు.

2025 మే 6న బాధితురాలి తల్లి జీడిమెట్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఇంటికి వచ్చిన సమయంలో చిన్న కుమార్తె ద్వారా పెద్ద కుమార్తె (15)పై తండ్రి లైంగిక దాడి చేసిన విషయం వెలుగులోకి వచ్చింది. విచారణలో, రెండు నెలల క్రితం చిన్న కుమార్తెను బయటకు పంపించి పెద్ద కుమార్తెపై దాడి చేసినట్టు, ఆ తర్వాత కూడా మళ్లీ బలవంతంగా అత్యాచారం చేసినట్టు బాధితురాలు వెల్లడించింది. బెదిరింపుల కారణంగా ఈ విషయం ఎవరికి చెప్పలేదని తెలిపింది.

ఫిర్యాదు అనంతరం నిందితుడిని ప్రశ్నించగా తప్పు చేశానని చెప్పి అక్కడి నుంచి పారిపోయాడు. కేసు నమోదు చేసిన పోలీసులు సాక్ష్యాలు సేకరించి 2025 మే 8న నిందితుడిని అరెస్ట్ చేసి న్యాయస్థానానికి తరలించారు. విచారణ పూర్తి చేసి చార్జ్ షీట్ దాఖలు చేశారు.

పూర్తి స్థాయి విచారణ అనంతరం మేడ్చల్‌లోని ఫాస్ట్ ట్రాక్ ప్రత్యేక న్యాయస్థానం నిందితుడిని దోషిగా తేల్చి 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధించింది. అలాగే బాధితురాలికి పరిహారం అందించాలని ఆదేశాలు జారీ చేసింది.

# రంగారెడ్డి జిల్లా జేఏసీ చైర్మన్‌గా డాక్టర్ కె. రామారావు ఏకగ్రీవం





తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులు, గెజిటెడ్ అధికారులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్ల దీర్ఘకాలిక పెండింగ్ సమస్యల పరిష్కారానికి రంగారెడ్డి జిల్లా ఉద్యోగ జాయింట్ యాక్షన్ కమిటీ సన్నాహక సమావేశం నాంపల్లి టీజీవో భవన్‌లో నిర్వహించారు.

మే 5న రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్, కొంగరకలాన్ వద్ద నిర్వహించనున్న ఒకరోజు నిరాహార దీక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలనే లక్ష్యంతో ఈ సమావేశం జరిగింది. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 15.25 లక్షల ఉద్యోగులు, పెన్షనర్ల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పి.ఆర్.సి, పెండింగ్ బిల్లులు, ఇ.హెచ్.ఎస్, సి.పి.ఎస్ రద్దు వంటి నాలుగు ప్రధాన డిమాండ్లతో పాటు మరో 64 పెండింగ్ అంశాలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ఈ నేపథ్యంలో మే 5న జరిగే ఒకరోజు నిరాహార దీక్ష కార్యక్రమానికి నాయకత్వ బాధ్యతలను టీజీఓ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కె. రామారావుకు అప్పగిస్తూ, ఆయన్ను జేఏసీ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఆమోదించారు.

సమావేశంలో టీఎన్జీఓ బాధ్యులు యశ్వంత్, శ్రీనివాస్, గోపాల్ నాయక్, రంగయ్య, పీఆర్‌టీయూ బాధ్యులు మహేందర్ రెడ్డి, ఎస్టీయూ బాధ్యులు ప్రవీణ్ కుమార్, టీజీఓ బాధ్యులు శ్రీనేష్ కుమార్ నోరి, నూతన కంటి వెంకట్, టీఆర్‌టీఎఫ్ ప్రతినిధి ఎం. రమేష్, జీటీఏ బాధ్యులు నరసింహ, టీజీఓ ప్రతినిధులు రేవతి, శాంతి శ్రీ, అనిత, మహేశ్వరి, రాకేష్, మసూద్ అలీతో పాటు వివిధ సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

# స్నేహ సమ్మర్ క్యాంపులు ప్రారంభం
# గ్రామాలన్నింటిలో బాలికలకు అవగాహన



రాష్ట్రంలోని అన్ని గ్రామాలలో బాలికల కోసం "స్నేహ సమ్మర్ క్యాంపులు" ప్రారంభమయ్యాయి. గ్రామీణ పేదరిక నిర్మూలన సంఘం ఆధ్వర్యంలో ఈ క్యాంపులు ప్రణాళికాబద్ధంగా నిర్వహించబడుతున్నాయి. యువ బాలికల భారీ పాల్గొనికతో కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.

మే 2 నుంచి జూన్ 10 వరకు జరిగే ఈ క్యాంపుల్లో బాలికల సమగ్ర అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. ఆరోగ్యం, భద్రత, విద్య, జీవన నైపుణ్యాలపై వివిధ సెషన్ల ద్వారా అవగాహన కల్పిస్తున్నారు.


బాల్య వివాహాల నివారణ, రక్తహీనత వంటి ఆరోగ్య సమస్యలపై చర్చలు నిర్వహిస్తూ, గ్రామాలను బాలికలకు సురక్షితంగా మార్చే చర్యలపై దృష్టి పెడుతున్నారు. వ్యక్తిగత, సామాజిక సమస్యలను గుర్తించి వాటి పరిష్కార మార్గాలను కూడా సూచిస్తున్నారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన, బ్యాంకింగ్ అలవాట్లు, పొదుపు ప్రాముఖ్యతపై శిక్షణ ఇస్తున్నారు. వ్యాయామం, క్రీడలు, యోగా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆరోగ్యకరమైన జీవనశైలిపై దృష్టి పెట్టిస్తున్నారు. విద్య ప్రాధాన్యం, వృత్తి మార్గదర్శనం, నైపుణ్యాభివృద్ధిపై ప్రత్యేక సెషన్లు కొనసాగుతున్నాయి.

సైబర్ భద్రత, మొబైల్ ఫోన్ వినియోగంపై బాధ్యతాయుత అవగాహన కల్పిస్తున్నారు. స్వావలంబన పెంపు లక్ష్యంగా 18 ఏళ్ల బాలికలకు సైకిల్ తొక్కడం నేర్పించే కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నారు.

క్యాంపుల ముగింపులో తల్లిదండ్రులను ఆహ్వానించి ముగింపు కార్యక్రమం నిర్వహించనున్నారు. బాల్య వివాహాల నివారణ, బాలికల భద్రత, విద్యాభివృద్ధిపై గ్రామ స్థాయి తీర్మానాలు పిల్లల గ్రామ సభల ద్వారా తీసుకునేలా చర్యలు చేపడుతున్నారు.

ఈ స్నేహ సమ్మర్ క్యాంపులు బాలికల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి, ఆరోగ్యకరమైన భవిష్యత్తుకు దారితీసే లక్ష్యంతో నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు.



# ప్రభుత్వానికి విప్‌లు కళ్లూ చెవులుగా పని చేస్తారు
# ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి



ప్రభుత్వ విప్‌లు పరిపాలనకు కళ్లూ చెవులుగా వ్యవహరిస్తారని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి తెలిపారు. శనివారం ఎంసీఆర్ హెచ్ ఆర్ డీ సంస్థలో శాసనసభ, శాసన మండలి విప్‌లతో సమావేశం నిర్వహించి రాష్ట్రంలోని ప్రజా సమస్యలను సమీక్షించారు.

ఈ సందర్భంగా విప్‌లు తమ నియోజకవర్గాల్లో తాగునీటి సమస్యలు, వేసవిలో సాగునీటి అవసరాలు, ధాన్యం కొనుగోలు పురోగతి వంటి అంశాలను ముఖ్యమంత్రికి వివరించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని, సంబంధిత సమస్యలను త్వరగా పరిష్కరించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

ప్రజలతో నిరంతరం అనుసంధానం కొనసాగిస్తూ వారి సమస్యలను తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని విప్‌లకు సూచించారు. జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండి సమస్యలను ఆలస్యం లేకుండా పరిష్కరించాలన్నారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలను గ్రామ స్థాయికి సమర్థంగా తీసుకెళ్లాలని, ప్రభుత్వం వెంటనే స్పందిస్తుందనే నమ్మకం ప్రజల్లో పెంపొందించాలన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలపై అవగాహన కల్పించేందుకు మీడియా వేదికలను వినియోగించాలన్నారు.

ప్రజా సమస్యలపై నిరంతరం సమాచారం పొందేందుకు, సమన్వయం బలోపేతం చేసేందుకు వారానికి ఒక రోజు విప్‌లతో సమావేశం నిర్వహిస్తానని ముఖ్యమంత్రి తెలిపారు.

ఈ సమావేశానికి ఎంపీ వేమ్ నరేందర్ రెడ్డి, శాసన మండలి ప్రధాన విప్ పట్నం మహేందర్ రెడ్డి, విప్‌లు ఆది శ్రీనివాస్, బీర్ల ఇలయ్య, ఎన్నం శ్రీనివాస్ రెడ్డి, విజయరమణ రావు, రామచంద్ర నాయక్, వేముల వీరేశం, అద్దంకి దయాకర్, బల్మూరి వెంకట్ హాజరయ్యారు.

# రబీ ధాన్యం కొనుగోలు వేగం

# రైతుల ఖాతాల్లో 1129 కోట్లు జమ




తెలంగాణ రాష్ట్రంలో రబీ 2025-26 సీజన్‌కు సంబంధించి ధాన్యం కొనుగోలు కార్యక్రమం వేగంగా కొనసాగుతోంది. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ ఇప్పటివరకు 12.38 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించింది.

పౌర సరఫరాల కమిషనర్ ఎం. స్టీఫెన్ రవీంద్ర ఆధ్వర్యంలో రైతులకు కనీస మద్దతు ధర చెల్లింపులు వేగంగా జరుగుతున్నాయి. ఇప్పటికే 1.54 లక్షలకుపైగా రైతుల బ్యాంకు ఖాతాల్లో 1,129.43 కోట్లు నేరుగా జమ చేయడం జరిగింది.

రాష్ట్రవ్యాప్తంగా ధాన్యం రాకను దృష్టిలో ఉంచుకుని 8,575 కొనుగోలు కేంద్రాలు పూర్తిస్థాయిలో పనిచేస్తున్నాయి. వీటిలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా 4,455 కేంద్రాలు, ఇందిరా క్రాంతి పథం ద్వారా 3,563 కేంద్రాలు, ఇతర సంస్థల ద్వారా 557 కేంద్రాలు నిర్వహణలో ఉన్నాయి.

రైతులు సన్న రకం, దొడ్డ రకం ధాన్యాన్ని పెద్ద మొత్తంలో తెస్తుండగా, ఇప్పటివరకు సన్న రకం 5.07 లక్షల మెట్రిక్ టన్నులు, దొడ్డ రకం 7.31 లక్షల మెట్రిక్ టన్నులు సేకరించబడ్డాయి. కొనుగోలు కేంద్రాల్లో నిల్వ సమస్యలు తలెత్తకుండా అధికారులు వేగంగా చర్యలు తీసుకుంటూ, కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలిస్తున్నారు.

నిజామాబాద్, నల్గొండ, కామారెడ్డి, సూర్యాపేట, కరీంనగర్, జగిత్యాల, మెదక్, యాదాద్రి భువనగిరి, పెద్దపల్లి, సిరిసిల్ల జిల్లాల్లో కొనుగోలు ప్రక్రియ ఉత్సాహంగా కొనసాగుతోంది.



# యంగ్ ఇండియా స్పోర్ట్స్ సమ్మిట్ 2026 విజయవంతం




Young India Physical Education & Sports University ఆధ్వర్యంలో నిర్వహించిన "యంగ్ ఇండియా స్పోర్ట్స్ సమ్మిట్ 2026" గచ్చిబౌలి స్టేడియంలో విజయవంతంగా జరిగింది. ఈ సమ్మిట్‌లో జాతీయ క్రీడా విధానాలు, విద్య, పరిశోధన, సాంకేతికత, క్రీడా రంగంలో ఉపాధి అవకాశాలపై విస్తృతంగా చర్చలు జరిగాయి.

సమ్మిట్‌ను ప్రారంభించిన ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి Jayesh Ranjan మాట్లాడుతూ, యూనివర్సిటీ తొలి ప్రధాన కార్యక్రమం క్రీడా నిపుణులు, విధాన నిర్ణేతలు, మేధావులను ఒకే వేదికపైకి తీసుకువచ్చిందన్నారు. తెలంగాణలో క్రీడల అభివృద్ధికి విస్తృత అవకాశాలు ఉన్నాయని, రాష్ట్రంలో బలమైన క్రీడా వ్యవస్థ నిర్మాణానికి ఈ యూనివర్సిటీ మార్గనిర్దేశకంగా నిలుస్తుందని తెలిపారు.

ప్రధాన అతిథిగా పాల్గొన్న రాష్ట్ర ప్రభుత్వ క్రీడా సలహాదారు A. P. Jitender Reddy మాట్లాడుతూ, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ దేశ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందుతుందనే విశ్వాసం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి కార్యక్రమాలు మరింత పెరగాలని ఆకాంక్షించారు.

క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ Shiv Sena Reddy మాట్లాడుతూ, ముఖ్యమంత్రి A. Revanth Reddy దృష్టికి అనుగుణంగా యూనివర్సిటీ స్థాపన జరిగిందన్నారు. యువ క్రీడాకారుల భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు మేధో చర్చలను విస్తరించాలని సూచించారు.

క్రీడా ప్రాధికార సంస్థ ఉపాధ్యక్షురాలు, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ Soni Baladevi మాట్లాడుతూ, గత రెండు సంవత్సరాలుగా తెలంగాణ క్రీడా శాఖ సంస్థల ఏర్పాటు, అకాడమీల పెంపు, గ్రామీణ ప్రతిభ గుర్తింపుకు పోటీల నిర్వహణ వంటి చర్యలతో రంగాన్ని బలోపేతం చేస్తోందన్నారు.

యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ Kishore Gopinathan మాట్లాడుతూ, అంతర్జాతీయ ప్రమాణాలను అనుసరించి క్రీడా విద్య, పరిశోధన, సాంకేతికతను సమన్వయం చేస్తూ సమగ్ర విద్యా కార్యక్రమాలు అందించడమే లక్ష్యమన్నారు.

ఈ సమ్మిట్‌లో తెలంగాణ క్రీడా విధానం, పరిపాలన, ఒలింపిక్ లక్ష్యం, క్రీడా విద్య, ఉపాధి అవకాశాలు, ఒలింపిక్ విలువలు, శారీరక అక్షరాస్యత, క్రీడా విజ్ఞానం, వైద్యం, లీగ్స్, సాంకేతికత, ఈ–స్పోర్ట్స్, పరా క్రీడలపై ఐదు ప్రధాన అంశాలపై చర్చలు జరిగాయి.

కార్యక్రమంలో Abhinav Bindra Foundation Trust, Adapted Sports India Foundation ప్రతినిధులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ప్రముఖులు Pullela Gopichand, ద్రోణాచార్య అవార్డు గ్రహీతలు Ismail Baig, Nagapuri Ramesh, అర్జున అవార్డు గ్రహీత J. J. Shobha, ఒలింపియన్ Neha Aggarwal పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా క్రీడా అధికారులు, శారీరక విద్య ఉపాధ్యాయులు, క్రీడాకారులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# కేంద్రీకృత కొనుగోలు విధానం ద్వారా బాధ్యత పెంపు: ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి



విద్యార్థులకు అవసరమైన అన్ని సామగ్రి సమయానికి అందేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి A. Revanth Reddy అధికారులను ఆదేశించారు. యూనిఫారాలు, నోట్ బుక్స్ వంటి అవసరమైన వస్తువులు సమయానికి అందితే విద్యార్థులు చదువుపై పూర్తిగా దృష్టి సారించగలరని తెలిపారు.

విద్యాశాఖతో పాటు బీసీ, మైనారిటీ, గిరిజన సంక్షేమ, ఎస్సీ అభివృద్ధి శాఖల పరిధిలో విద్యార్థులకు సరఫరా చేసే వస్తువుల కేంద్రీకృత కొనుగోలు విధానంపై సమీక్ష నిర్వహించారు. గతంలో ప్రతి శాఖ విడివిడిగా కొనుగోలు, సరఫరా నిర్వహించడంతో అసమానతలు, అవకతవకలు చోటుచేసుకున్నాయని పేర్కొన్నారు. ఈ సమస్యలను నివారించడానికి ప్రభుత్వం కేంద్రీకృత కొనుగోలు విధానాన్ని అమలు చేస్తున్నట్లు స్పష్టం చేశారు.

యూనిఫారాలు, నోట్ బుక్స్, ట్రంక్ బాక్స్‌లు వంటి వస్తువుల సరఫరాలో ఎలాంటి అవకతవకలు సహించబోమని హెచ్చరించారు. విద్యార్థులకు అందించే నోట్ బుక్స్, ట్రంక్ బాక్స్‌లు, ప్లేట్లు, గ్లాసులు, ట్రాక్ సూట్లు, బెడ్ షీట్లు, స్కూల్ బ్యాగులు, ఐడి కార్డులు, యూనిఫారాల నాణ్యతపై రాజీ ఉండకూడదని సూచించారు.

జూన్ 15లోపు అన్ని సామగ్రి విద్యార్థులకు అందించాలని, సరఫరా పూర్తయ్యాగానే సరఫరాదారులకు చెల్లింపులు వెంటనే చేయాలని ఆదేశించారు. మండల స్థాయిలో నోడల్ అధికారి నియామకం చేసి, అక్కడి నుంచి గ్రామ స్థాయిలో పాఠశాలలు, హాస్టళ్లకు సరఫరా జరిగేలా చూడాలని చెప్పారు.

సరఫరా ప్రక్రియను ఫోటోలు, వీడియోల రూపంలో నమోదు చేయాలని, ప్రతి విద్యార్థికి అన్ని వస్తువులు అందాయో లేదో నిర్ధారించాలని ఆదేశించారు. నోట్ బుక్స్, యూనిఫారాలు తదితర వస్తువుల నాణ్యత, వినియోగంపై ప్రతి విద్యార్థి నుంచి అభిప్రాయాలు సేకరించాలని సూచించారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖలు, విద్యాశాఖల మధ్య సమన్వయం కోసం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సమావేశంలో పి. సుదర్శన్ రెడ్డి, వేమ్ నరేందర్ రెడ్డి, వేముల శ్రీనివాసులు తదితర అధికారులు పాల్గొన్నారు.



# ఎస్సెస్సీ ఫలితాల్లో తెలంగాణకు రికార్డు స్థాయి ఉత్తీర్ణత




తెలంగాణ రాష్ట్రంలో పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు-మార్చి 2026 ఫలితాలను ప్రభుత్వం విడుదల చేసింది. ఈసారి మొత్తం ఉత్తీర్ణత శాతం 95.15గా నమోదై గత సంవత్సరంతో పోలిస్తే గణనీయంగా పెరిగింది.

ఈ ఏడాది పరీక్షలు మార్చి 14 నుంచి ఏప్రిల్ 16 వరకు నిర్వహించగా, ఏప్రిల్ 23 నుంచి మూల్యాంకనం పూర్తి చేశారు. మొత్తం 5,26,166 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. అందులో 4,91,774 మంది ఉత్తీర్ణులయ్యారు. బాలుర ఉత్తీర్ణత శాతం 94.07 కాగా, బాలికల ఉత్తీర్ణత శాతం 96.26గా నమోదు అయింది. గత సంవత్సరంతో పోలిస్తే మొత్తం ఉత్తీర్ణతలో 2.19 శాతం పెరుగుదల కనిపించింది.

జిల్లాల వారీగా పరిశీలిస్తే ములుగు జిల్లా 99.30 శాతం ఉత్తీర్ణతతో మొదటి స్థానంలో నిలిచింది. హైదరాబాద్ జిల్లా 89.23 శాతం ఉత్తీర్ణతతో చివరి స్థానంలో ఉంది. రాష్ట్ర స్థాయిలో రెసిడెన్షియల్ పాఠశాలలు 99.10 శాతం ఉత్తీర్ణతతో ముందంజలో నిలిచాయి.

విద్యార్థుల విభాగాల వారీగా చూస్తే ప్రభుత్వ పాఠశాలల్లో 86.18 శాతం, జిల్లా పరిషత్ పాఠశాలల్లో 93.53 శాతం, మోడల్ పాఠశాలల్లో 97.83 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ప్రైవేట్ పాఠశాలల్లో 95.81 శాతం ఉత్తీర్ణత సాధించారు.



ఈసారి మొత్తం 5,731 పాఠశాలలు 100 శాతం ఉత్తీర్ణత సాధించగా, 6 పాఠశాలలు ఒక్క విద్యార్థి కూడా ఉత్తీర్ణత సాధించలేకపోయాయి. ప్రత్యేక అవసరాలున్న విద్యార్థుల్లో కూడా మంచి ఫలితాలు నమోదయ్యాయి.

ఫలితాలను విద్యార్థులు అధికారిక వెబ్‌సైట్ల ద్వారా చూడవచ్చు. అలాగే మీ సేవా వాట్సాప్ సేవ ద్వారా కూడా ఫలితాలు తెలుసుకునే అవకాశం కల్పించారు.

అదనంగా రీకౌంటింగ్, రీ వెరిఫికేషన్ కోసం విద్యార్థులు ఏప్రిల్ 30 నుంచి మే 14 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. రీకౌంటింగ్‌కు రూ.500, రీ వెరిఫికేషన్‌కు ప్రతి సబ్జెక్టుకు రూ.1000 ఫీజు నిర్ణయించారు.

ఇంటర్మీడియట్ అడ్మిషన్ల కోసం ఎస్సెస్సీ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు జూన్ 5 నుంచి జూన్ 12 వరకు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.

# మే చివరి నాటికి 2బిహెచ్కే ఇళ్ల కేటాయింపు పూర్తి



రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న 2బిహెచ్కే ఇళ్ల లబ్ధిదారుల గుర్తింపు, కేటాయింపులను మే నెలాఖరు నాటికి పూర్తి చేయాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అధికారులను ఆదేశించారు. గృహనిర్మాణ, రెవెన్యూ, అటవీ అంశాలపై పూర్వ మెదక్, కరీంనగర్ జిల్లాల ప్రజాప్రతినిధులు, అధికారులతో గృహ నిర్మాణ సంస్థ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు.

చివరి దశలో ఉన్న ఇళ్లను త్వరగా పూర్తి చేయాలని సూచించిన మంత్రి, అసంపూర్తిగా ఉన్న గృహాలకు ఇప్పటికే చేసిన ఖర్చును సర్దుబాటు చేసి గరిష్టంగా ?5 లక్షల వరకు అదనపు ఆర్థిక సహాయం అందిస్తామని తెలిపారు. కాంట్రాక్టర్లు పనులు పూర్తి చేయడానికి ముందుకు రాకపోతే లబ్ధిదారులే నిర్మాణం చేపట్టేలా గ్రీన్ చానల్ విధానం ద్వారా నిధులు విడుదల చేస్తామని స్పష్టం చేశారు.

సమావేశంలో 2బిహెచ్కే ఇళ్లలో అసంపూర్తి పనులు, విద్యుత్, తాగునీరు, డ్రైనేజీ, రహదారుల కొరత, అర్హత లేని వారు నివసించడం వంటి సమస్యలను ప్రజాప్రతినిధులు ప్రస్తావించారు. దీనిపై స్పందించిన మంత్రి, అర్హత లేని వారిని వెంటనే తొలగించి అర్హులైన కుటుంబాలకు ఇళ్లను మళ్లీ కేటాయించాలని కలెక్టర్లకు ఆదేశించారు. స్థానిక ఎమ్మెల్యేల భాగస్వామ్యంతో ఈ ప్రక్రియ చేపట్టాలని సూచించారు. ఇళ్ల కాలనీల్లో మౌలిక వసతుల కోసం 400 కోట్లను వినియోగిస్తున్నట్లు తెలిపారు. కేటాయించినా నివసించని ఇళ్లను రద్దు చేసి అర్హులైన వారికి ఇవ్వాలని చెప్పారు. బిల్లుల చెల్లింపుల్లో అవకతవకలు చోటుచేసుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా ఏ. రేవంత్ రెడ్డి నేతృత్వంలో అమలు చేస్తున్న ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకం ద్వారా పేదలకు ఇల్లు కల సాకారం చేస్తున్నామని తెలిపారు. అర్హతకు పేదరికమే ప్రమాణమని, దరఖాస్తు తేదీతో సంబంధం లేదని స్పష్టం చేశారు. అర్హులైన వారికి ప్రయోజనం అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను ఆదేశించారు.

ఇళ్ల నిర్మాణానికి 40 టన్నుల ఇసుకను ఉచితంగా అందిస్తున్నప్పటికీ దుర్వినియోగం జరుగుతున్నట్లు నివేదికలు వచ్చిన నేపథ్యంలో సరైన పంపిణీకి విధానం రూపొందించాలని సూచించారు. పట్టణాలకు దూరంగా ఉన్న ఇళ్లలో నివసించకుండా అద్దెకు ఇస్తున్న వారిపై చర్యలు తీసుకుని సమీప అర్హులకు కేటాయిస్తామని తెలిపారు.

## ప్రభుత్వ భూముల రక్షణలో రాజీ లేదు

ప్రభుత్వ భూముల ఆక్రమణపై ఎట్టి పరిస్థితుల్లోనూ సహనం ఉండదని మంత్రి స్పష్టం చేశారు. అక్రమ ఆక్రమణలను అడ్డుకునేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రెవెన్యూ, అటవీ భూముల సరిహద్దు వివాదాలను పరిష్కరించేందుకు ఆధునిక సాంకేతికతతో సంయుక్త సర్వే చేపట్టాలని సూచించారు. భూమి పరిపాలనలో పారదర్శకత, ఖచ్చితత్వం కోసం సర్వే, సెటిల్మెంట్, భూ రికార్డుల విభాగం ద్వారా సంస్కరణలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. కొత్త రెవెన్యూ డివిజన్లు, మండలాల ఏర్పాటుపై ప్రతిపాదనలు లేవని, అయితే ప్రతి జిల్లా, నియోజకవర్గ కేంద్రాల్లో ఉప-రిజిస్ట్రార్, ఎంఆర్వో, ఆర్డీఓ కార్యాలయాల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. ఈ సమావేశంలో దామోదర రాజనర్సింహ, తుమ్మల నాగేశ్వరరావు, డి. శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రూఫ్‌టాప్ సోలార్ ప్లాంట్ ప్రారంభం

గృహ నిర్మాణ సంస్థ కార్యాలయంలో 30 కిలోవాట్ సామర్థ్యంతో రూఫ్‌టాప్ సౌర విద్యుత్ ప్లాంట్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ ప్లాంట్ ద్వారా నెలకు సుమారు 4,500 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతూ భవనానికి విద్యుత్ ఖర్చు తగ్గనుంది.

# ప్రమాదకర భవనాలపై సమాచారం ఇవ్వండి: హైడ్రా విజ్ఞప్తి

నగరంలో పాడైపోయిన, ప్రమాదకరంగా మారిన భవనాలపై వెంటనే సమాచారం ఇవ్వాలని HYDRAA ప్రజలకు విజ్ఞప్తి చేసింది. ప్రాణాలు, ప్రజా భద్రతకు ముప్పు కలిగించే భవనాలను గుర్తించి కూల్చివేయడానికి చర్యలు చేపడుతున్నట్లు తెలిపింది.

ఈ నేపథ్యంలో పౌరులు 9000113667 హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేసి ప్రమాదకర భవనాల వివరాలు అందించాలని కోరింది. నివాస ప్రాంతాలే కాకుండా ఎక్కువగా జనసంచారం ఉండే ప్రదేశాల్లో ఉన్న పాత భవనాలపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు పేర్కొంది.

ఇటీవల Bengaluruలో భారీ వర్షాల కారణంగా Bowring and Lady Curzon Hospital సమీపంలో గోడ కూలి ఏడుగురు మృతి చెందిన ఘటనను ఉదాహరణగా ప్రస్తావించింది. గతంలో కూడా హైదరాబాద్‌లో ఇలాంటి సంఘటనలు జరిగినట్లు గుర్తుచేసింది.

ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని, మున్సిపల్ సంస్థలతో సమన్వయం చేస్తూ ప్రమాదకర నిర్మాణాల వివరాలు సేకరిస్తున్నామని తెలిపింది.

పౌరులు భవనాల స్థానం, ఫోటోలు, లైవ్ లోకేషన్‌ను హెల్ప్‌లైన్‌కు పంపిస్తే తక్షణ చర్యలు తీసుకుంటామని వెల్లడించింది. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని భరోసా ఇచ్చింది.

కాలానుగుణం కాని వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రమాదం ఎప్పుడైనా సంభవించే అవకాశం ఉందని, వెంటనే సమాచారం ఇవ్వడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని హైడ్రా స్పష్టం చేసింది.

# తెలంగాణలో జర్నలిస్టు అక్రెడిటేషన్‌లకు కొత్త దిశ




రాష్ట్రంలో అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రెడిటేషన్ కార్డులు అందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని సమాచార ప్రజాసంబంధాలు, ఆదాయ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. సమాచార శాఖ నిర్వహించిన కార్యక్రమంలో కొత్త అక్రెడిటేషన్ కార్డులను పంపిణీ చేశారు.

ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి దిశానిర్దేశంలో మీడియా వృత్తిదారులకు మెరుగైన ఆరోగ్య సదుపాయాలు, సంక్షేమ ప్రయోజనాలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని చెప్పారు.

దేశవ్యాప్తంగా అమలవుతున్న ఉత్తమ విధానాలను సమీక్షించిన తరువాతే కొత్త అక్రెడిటేషన్ ప్రక్రియ చేపట్టినట్టు వివరించారు. గతంలో 32,500 అక్రెడిటేషన్‌లకు అవకాశం ఉన్నప్పటికీ 23,352 వరకు మాత్రమే పరిమితం చేసినట్లు తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం అర్హతను 46,000 మందికి పైగా విస్తరించిందని, ఇప్పటివరకు సుమారు సమాచార శాఖ 2,800 కార్డులు ఆమోదించబడినట్లు పేర్కొన్నారు. జర్నలిస్టు సంఘాల సూచనల ఆధారంగా ప్రభుత్వ ఉత్తర్వుల్లో మార్పులు చేసినట్టు తెలిపారు. అర్హులైన వారందరికీ అక్రెడిటేషన్ ఇవ్వడంలో ఎలాంటి సంకోచం ఉండదని స్పష్టం చేశారు.

జిల్లా కలెక్టర్లకు మే 1న అన్ని జిల్లాల్లో అక్రెడిటేషన్ కార్డుల పంపిణీ చేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. జర్నలిస్టులు మే 10లోపు దరఖాస్తులు సమర్పించాలని, ఆ గడువులో వచ్చిన అన్ని దరఖాస్తులను పరిశీలిస్తామని చెప్పారు.

అక్రెడిటేషన్ పొందిన జర్నలిస్టుల సంఖ్య ఖరారైన తరువాత ఆరోగ్య, ఇతర సంక్షేమ పథకాల అమలుకు ప్రణాళిక రూపొందిస్తామని పేర్కొన్నారు. సంస్థ మారినా అక్రెడిటేషన్ కొనసాగుతుందని, దీనిపై ఎలాంటి ఆందోళన అవసరం లేదని తెలిపారు.

ఏప్రిల్ 30తో ముగియనున్న జర్నలిస్టుల బస్ పాస్‌లకు 30 రోజుల పొడిగింపు ఇస్తున్నట్లు ప్రకటించారు.

ఈ కార్యక్రమంలో మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి, సమాచార శాఖ ప్రత్యేక కమిషనర్ జి. ముకుంద రెడ్డి పాల్గొన్నారు.



# పిల్లలు నవ్వే నిజమైన అభివృద్ధి: మంత్రి సీతక్క



రాష్ట్రంలో బాలల సంక్షేమం, తల్లుల గౌరవం, కుటుంబ భద్రత కోసం ప్రభుత్వం మరో కీలక ముందడుగు వేసింది. పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దానసరి అనసూయ సీతక్క కాచిగూడ రైల్వే స్టేషన్‌లో దత్తత సహాయక కేంద్రం, ఫోస్టర్ కేర్ కేంద్రాన్ని ప్రారంభించారు. అలాగే కాచిగూడ బస్ స్టేషన్‌లో తల్లిపాలు అందించే కియోస్క్‌ను ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో అంబర్‌పేట్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, హైదరాబాద్ కలెక్టర్ ప్రియాంక అల, మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనిత రామచంద్రన్, డైరెక్టర్ శ్రుతి ఓజా సహా ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ పిల్లల నవ్వే నిజమైన అభివృద్ధి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాలు ప్రభుత్వ మానవతా దృక్పథానికి నిదర్శనమని, ప్రతి చిన్నారి జీవితంలో వెలుగు నింపడం, ప్రతి తల్లికి గౌరవం కల్పించడం, ప్రతి కుటుంబానికి భద్రత కల్పించడం లక్ష్యంగా ఉన్నాయని చెప్పారు.

దత్తత సహాయక కేంద్రం ద్వారా కుటుంబం లేని పిల్లల జీవితాల్లో మార్పు తీసుకురావడం లక్ష్యమని తెలిపారు. దత్తత అనేది దానం కాదని, అది ఒక చిన్నారి జీవితానికి కొత్త ఆరంభమని వివరించారు. ఈ కేంద్రం ద్వారా సరైన సమాచారం, చట్టపరమైన మార్గదర్శకత్వం, సలహా సేవలు అందించబడతాయని చెప్పారు. అక్రమ దత్తతలపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

ఫోస్టర్ కేర్ విధానం గురించి మాట్లాడుతూ ప్రతి చిన్నారికి వెంటనే శాశ్వత కుటుంబం దొరకకపోయినా తాత్కాలికంగా ప్రేమతో కూడిన వాతావరణం అందించడం అవసరమని చెప్పారు. ఈ విధానం పిల్లల భవిష్యత్తుకు ఆశాకిరణంగా నిలుస్తుందని తెలిపారు.

తల్లిపాలు కియోస్క్ ప్రారంభం సందర్భంగా ప్రజాస్థలాల్లో తల్లులకు గౌరవం, గోప్యత కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. కాచిగూడ బస్ స్టేషన్ వంటి రద్దీ ప్రాంతాల్లో ఇలాంటి సౌకర్యాలు ఏర్పాటు చేయడం ముఖ్యమని, త్వరలో మరిన్ని ప్రాంతాల్లో కూడా ఏర్పాటు చేస్తామని చెప్పారు. రాష్ట్ర చరిత్రలో ఇదొక తొలి ప్రయత్నమని పేర్కొన్నారు.

పిల్లల మానసిక ఆరోగ్యంపై కూడా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. రోష్ని కేంద్రంతో భాగస్వామ్యంలో పిల్లల ఆత్మవిశ్వాసం, సంక్షేమం పెంచేందుకు కౌన్సెలింగ్, థెరపీ సేవలు అందిస్తున్నామని చెప్పారు.

ఈ కార్యక్రమాలు ప్రభుత్వ 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగమని వెల్లడించారు. చిన్నారుల కోసం చేసే ప్రతి చిన్న ప్రయత్నం గొప్ప మార్పును తీసుకురాగలదని, పిల్లల నవ్వు కోసం కలిసి పనిచేస్తే అదే నిజమైన అభివృద్ధి అని మంత్రి సీతక్క పేర్కొన్నారు.



# ప్రజలకు ఎలాంటి అసౌకర్యం లేకుండా నిరంతర విద్యుత్ సరఫరా లక్ష్యం



రాష్ట్రంలో తీవ్రమైన ఎండల కారణంగా విద్యుత్ వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో కూడా ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిరంతర విద్యుత్ సరఫరా చేయడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు.

దేశవ్యాప్తంగా విద్యుత్ డిమాండ్ పెరుగుతున్న పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ప్రజా భవన్‌లో విద్యుత్ శాఖ ఉన్నతాధికారులతో రాష్ట్ర విద్యుత్ సరఫరా పరిస్థితిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇళ్లలో, కార్యాలయాల్లో ఎయిర్ కండీషనర్లు, కూలర్లు వినియోగం భారీగా పెరగడం, వ్యవసాయ అవసరాలు కూడా కలిసివచ్చి విద్యుత్ గ్రిడ్‌పై అదనపు ఒత్తిడి ఏర్పడిందని అధికారులు వివరించారు.

ఈ పరిస్థితుల్లో రాష్ట్ర అవసరాలకు ఎలాంటి లోటు లేకుండా విద్యుత్ ఎక్స్ఛేంజ్‌ల ద్వారా అదనపు విద్యుత్ కొనుగోలు చేయాలని మంత్రి ఆదేశించారు. ఆసుపత్రులు, తాగునీటి సరఫరా పథకాలు వంటి అత్యవసర సేవలకు ఎట్టి పరిస్థితుల్లోనూ అంతరాయం కలగకుండా నిరంతరం పర్యవేక్షణ చేయాలని స్పష్టం చేశారు.

రాష్ట్రంలో ఉన్న విద్యుత్ ఉత్పత్తి యూనిట్లన్నింటిని పూర్తి సామర్థ్యంతో వినియోగించుకోవాలని, జలవిద్యుత్ ఉత్పత్తిని సమర్థంగా నిర్వహించాలని సూచించారు. రాబోయే రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉన్నందున ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని, విద్యుత్ సంస్థలు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు.

రాష్ట్ర విద్యుత్ వ్యవస్థ స్థిరంగా ఉందని, ఎలాంటి సవాళ్లను ఎదుర్కొనేందుకు తగిన ఏర్పాట్లు ఉన్నాయని అధికారులు తెలిపారు. అన్ని వర్గాల వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి సూచించారు. క్షేత్ర స్థాయి సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని కూడా ఆదేశించారు.

ఈ సమావేశంలో విద్యుత్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్, ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణ భాస్కర్, జెన్‌కో సీఎండీ హరీష్, ఎస్‌పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి పటిల్ తదితరులు పాల్గొన్నారు.



# రైతులకు వాతావరణ సూచనల కోసం నూతన పథకం పరిశీలన





వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును అభివృద్ధి వినూత్న ప్రయోగశాల ప్రతినిధులు కార్యాలయంలో కలిశారు. రైతులకు సమయానికి వాతావరణ ఆధారిత సూచనలు అందించే కార్యక్రమాల గురించి మంత్రికి వివరించారు.

ఈ సంస్థ ప్రస్తుతం ఒడిశా, తెలంగాణ రాష్ట్రాల్లో ప్రయోగాత్మక ప్రాజెక్టులు అమలు చేస్తున్నట్లు తెలిపారు. వర్షపాతం, వాతావరణ పరిస్థితులపై ముందస్తు సమాచారం రైతులకు సందేశాల ద్వారా పంపుతున్నట్లు చెప్పారు. దీని వల్ల విత్తనాలు వేసే సమయం, కోత, మార్కెట్‌కు సరుకు పంపించే సమయంపై రైతులు సరైన నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంటుందని వివరించారు. అకాల వర్షాలు, తుఫాన్లు, బలమైన గాలుల వల్ల పంటలకు కలిగే నష్టాన్ని తగ్గించడంలో ఈ విధానం సహాయపడుతుందని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టును విస్తరించేందుకు ప్రభుత్వ మద్దతు అందించాలని ప్రతినిధులు కోరారు.

ఈ విషయంపై వ్యవసాయ శాఖ డైరెక్టర్‌ను ప్రతిపాదనను పూర్తిగా పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు.

# ఉస్మానియా జనరల్ ఆసుపత్రిలో అరుదైన కాలేయ మార్పిడి విజయవంతం



Osmania General Hospital లో వైద్యులు అరుదైన మరియు అత్యంత క్లిష్టమైన కాలేయ మార్పిడి శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. గ్లైకోజెన్ నిల్వ వ్యాధితో బాధపడుతున్న 18 నెలల చిన్నారిపై ఈ శస్త్రచికిత్స చేపట్టారు.

సుమారు 10 కిలోల బరువు మాత్రమే ఉన్న చిన్నారిపై 14 గంటలకు పైగా సాగిన ఈ శస్త్రచికిత్సలో తండ్రి తన కాలేయంలోని ఒక భాగాన్ని దానం చేసి ప్రాణాలను కాపాడారు.

చిన్నారి వయస్సు తక్కువగా ఉండటం, బరువు తక్కువగా ఉండటం, గ్లైకోజెన్ నిల్వ వ్యాధి వంటి క్లిష్టతల కారణంగా ఈ శస్త్రచికిత్స వైద్యులకు సవాలుగా మారిందని నిపుణులు తెలిపారు. అయినప్పటికీ శస్త్రచికిత్సను అత్యంత జాగ్రత్తగా, సమర్థంగా పూర్తి చేశారు.

ఈ మొత్తం చికిత్సను Aarogyasri Scheme కింద ఉచితంగా అందించడం ద్వారా చిన్నారికి ఉన్నత వైద్య సేవలు అందాయి.

శస్త్రచికిత్స అనంతరం చిన్నారి ఆరోగ్యం స్థిరంగా ఉందని వైద్యులు తెలిపారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో ఇలాంటి అత్యాధునిక కాలేయ మార్పిడి శస్త్రచికిత్సలు చాలా అరుదుగా జరుగుతాయని, ఇది ప్రజా వైద్య రంగంలో ఒక ముఖ్యమైన మైలురాయిగా ఆసుపత్రి వర్గాలు పేర్కొన్నాయి.

ఆరోగ్య శాఖ మంత్రి Damodar Rajanarasimha వైద్య బృందాన్ని అభినందిస్తూ, రాష్ట్రంలో అత్యున్నత వైద్య సేవలను మరింత బలోపేతం చేయాలనే ప్రభుత్వ సంకల్పాన్ని వెల్లడించారు.

# హైదరాబాద్ మెట్రోపై తెలంగాణ ప్రభుత్వ పూర్తి అధికారం



హైదరాబాద్ మెట్రో రైలు నిర్వహణపై తెలంగాణ ప్రభుత్వం పూర్తి అధికారం సాధించింది. ఎల్ అండ్ టీ సంస్థతో బుధవారం ఒప్పందం కుదుర్చుకుని మెట్రో రైలు ఫేజ్-1 ను ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకుంది. హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ ద్వారా ఈ స్వాధీనం ప్రక్రియ పూర్తి అయింది.

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఎల్ అండ్ టీ సంస్థతో పలు దఫాల చర్చలు జరిపింది. అనంతరం రాష్ట్ర కార్యాలయంలో జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో ఈ ఒప్పందం కుదిరింది. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణ రావు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, మెట్రో ఎండీ సర్ఫరాజ్ అహ్మద్, ఎల్ అండ్ టీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఈ ఒప్పందం ప్రకారం ఎల్ టీ ఎంఆర్ హెచ్ ఎల్ సంస్థకు చెందిన 100 శాతం షేర్లను ప్రభుత్వం 1,461.47 కోట్ల రూపాయల విలువకు కొనుగోలు చేసింది. ఎల్ అండ్ టీ తరఫున డీకే సేన్, ఎల్ టీ ఎంఆర్ హెచ్ ఎల్ తరఫున కేవీబీ రెడ్డి, ప్రభుత్వం తరఫున సర్ఫరాజ్ అహ్మద్ ఒప్పందంపై సంతకాలు చేశారు. మొత్తం 13,538.53 కోట్ల రూపాయల అప్పును ప్రభుత్వం భరోసాతో తిరిగి పునర్వ్యవస్థీకరించనుంది. ఈ ప్రక్రియలో ఐడీబీఐ క్యాపిటల్ లావాదేవీ సలహాదారుగా, సరాఫ్ అండ్ పార్ట్నర్స్ న్యాయ సలహాదారుగా పనిచేయనున్నారు.

ప్రభుత్వ ఆధీనంలోకి వచ్చిన తర్వాత ప్రయాణికులకు అనుకూలంగా సేవలను మెరుగుపర్చే చర్యలు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. ఫేజ్-1 తో పాటు ప్రతిపాదిత ఫేజ్-2 పనుల రూపకల్పన, అమలు, ప్రణాళికలో సమన్వయం పెరుగుతుందని చెప్పారు. భవిష్యత్తులో విశ్వసనీయమైన, సమగ్ర మెట్రో రవాణా వ్యవస్థను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా నిర్ణయాలు తీసుకుంటున్నారు.


2017 నవంబర్ నుంచి నగరంలో మూడు మార్గాల్లో 69 కిలోమీటర్ల మేర మెట్రో సేవలు అందుతున్నాయి. రోజుకు సుమారు 4.50 లక్షల మంది ప్రయాణికులు మెట్రో సేవలను వినియోగిస్తున్నారు. ప్రారంభం నుంచి ఇప్పటి వరకు 86 కోట్లకు పైగా ప్రయాణికులు ప్రయాణించారు.

ఒప్పందానికి ముందు ఎల్ అండ్ టీ చైర్మన్ ఎస్ఎన్ సుబ్రహ్మణ్యన్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి మెట్రో భవిష్యత్ నిర్వహణపై చర్చించారు.

# బీసీ సంక్షేమ గురుకుల విద్యార్థుల అద్భుత ఫలితాలు



Vishwaprabhalika
Marks 585
Mandamarri Girls



G Shashikanth
Marks 586
Jamgoan Boys



G.Srinithya
Marks 586
Jainath Girls

బీసీ సంక్షేమ గురుకుల విద్యా సంస్థల విద్యార్థులు ఈ ఏడాది పదో తరగతి ఫలితాల్లో విశేష ప్రతిభ కనబరిచారు. మొత్తం ఉత్తీర్ణత శాతం 98.99గా నమోదై రాష్ట్ర స్థాయిలో రెండో స్థానాన్ని సాధించారు. ఇది రాష్ట్ర సగటుతో పోలిస్తే 4.84 శాతం ఎక్కువగా ఉండటం గమనార్హం.

ఈ ఫలితాల్లో నితీషా, శ్రీనిధి ఇద్దరు విద్యార్థినులు గరిష్టంగా 588 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచారు. సాయి మనోజ్ రెడ్డి, లాస్య 587 మార్కులు సాధించి ప్రతిభ చూపించారు. 580 మార్కులకు పైగా 60 మంది విద్యార్థులు, 570కి పైగా 364 మంది, 560కి పైగా 1061 మంది విద్యార్థులు మార్కులు సాధించారు. మొత్తం 3598 మంది విద్యార్థులు 90 శాతం కంటే ఎక్కువ మార్కులు సాధించడం విశేషం.

మొత్తం 294 పాఠశాలల్లో 204 పాఠశాలలు శాతం శాతం ఫలితాలు సాధించాయి. ఈ సంవత్సరం 19,245 మంది పరీక్షలకు హాజరుకాగా, అందులో 19,047 మంది ఉత్తీర్ణులయ్యారు. వీరిలో 9,093 మంది అబ్బాయిలు, 9,954 మంది అమ్మాయిలు ఉన్నారు.

బీసీ సంక్షేమ వసతి గృహాల విద్యార్థులు కూడా మంచి ఫలితాలు సాధించారు. 365 ప్రీ-మెట్రిక్ వసతి గృహాల నుంచి పరీక్షలకు హాజరైన 4,941 మందిలో 4,746 మంది ఉత్తీర్ణులై 96.05 శాతం ఉత్తీర్ణత నమోదు చేశారు. 285 వసతి గృహాలు శాతం శాతం ఫలితాలు సాధించాయి. ఆదిలాబాద్, హైదరాబాద్, ములుగు జిల్లాలు శాతం శాతం ఫలితాలు నమోదు చేశాయి.

విద్యార్థుల ప్రతిభకు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి బాల మాయాదేవి, గురుకుల సమాఖ్య కార్యదర్శి బడుగు సైదులు అభినందనలు తెలిపారు.

# డిజిటల్ విధానంలో జాతీయ జనగణన ప్రారంభం - ఓం బిర్లా


ఓం బిర్లా జాతీయ జనగణన 2027 తొలి దశలో భాగంగా డిజిటల్ సమాచార పత్రాన్ని పూర్తి చేశారు. ఢిల్లీలోని అధికారిక నివాసంలో ఈ ప్రక్రియను చేపట్టారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ జనగణన పరిపాలన వ్యవస్థలో కొత్త శకానికి నాంది అని తెలిపారు. దేశ చరిత్రలో తొలిసారిగా జనాభా లెక్కింపును పూర్తిగా డిజిటల్ విధానంలో నిర్వహిస్తున్నామని వెల్లడించారు. ఈ విధానం ద్వారా ప్రతి కుటుంబం తమ వివరాలను సురక్షితంగా, ఖచ్చితత్వంతో సులభంగా నమోదు చేసుకునే అవకాశం లభిస్తుందని పేర్కొన్నారు.

డిజిటల్ గణన వైపు తీసుకున్న ఈ అడుగు దేశ సాంకేతిక పురోగతికి ప్రతీక అని చెప్పారు. దీని వల్ల జాతీయ గణాంకాలు మరింత ఖచ్చితంగా రూపుదిద్దుకొని క్షేత్రస్థాయి వాస్తవాలను ప్రతిబింబిస్తాయని వివరించారు.

'జనగణన ద్వారా ప్రజా సంక్షేమం' లక్ష్యాన్ని ప్రస్తావిస్తూ ఈ కీలక ప్రక్రియలో ప్రజలంతా చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరు తమ వివరాలను నమోదు చేయడంతో పాటు ఇతరులను ప్రోత్సహించాలని కోరారు. బలమైన, సుసంపన్న భారత నిర్మాణానికి ఇది పునాది అవుతుందని తెలిపారు.

ఈ సందర్భంగా సమాచార పత్రాన్ని నింపే సమయంలో భారత రిజిస్ట్రార్ జనరల్, సెన్సస్ కమిషనర్ మృత్యుంజయ్ కుమార్ నారాయణ్ ప్రత్యక్షంగా సహకరించారు.



# విశాఖలో ఎల్‌సీటీ శంకుస్థాపన..

# నావికాదళ సామర్థ్యాలకు బలమైన ఊతం

ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో ఉన్న డీఆర్‌డీఓ పరిధిలోని నావల్ సైన్స్ అండ్ టెక్నలాజికల్ లాబొరేటరీలో అత్యాధునిక 'లార్జ్ కేవిటేషన్ టన్నెల్' నిర్మాణానికి రాజ్‌నాథ్ సింగ్ శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టుతో భారత నావికాదళ పరిశోధన, పరీక్షా సామర్థ్యాలు మరింతగా బలపడనున్నాయి. సాంకేతిక స్వావలంబన లక్ష్యానికి ఇది కీలక మైలురాయిగా భావిస్తున్నారు.

ఈ సందర్భంగా మాట్లాడిన రాజ్‌నాథ్ సింగ్, ఎల్‌సీటీ పూర్తయిన తరువాత దేశీయంగానే పరికరాలు, వ్యవస్థలు, ఉపవ్యవస్థల రూపకల్పనతో పాటు పరీక్షలు నిర్వహించే సామర్థ్యం భారత్‌కు లభిస్తుందని చెప్పారు. ఇప్పటివరకు కీలక పరీక్షల కోసం విదేశాలపై ఆధారపడాల్సి వచ్చిన పరిస్థితి పూర్తిగా తొలగిపోతుందని పేర్కొన్నారు. ప్రొపల్షన్ వ్యవస్థల అభివృద్ధి, శబ్ద కాలుష్యం తగ్గింపు, స్టెల్త్ సామర్థ్యాల పెంపు, జలాంతర్గాములు, యుద్ధ నౌకల రూపకల్పనలో ఈ సదుపాయం కీలకంగా ఉపయోగపడుతుందని వివరించారు.



ఒకే వ్యవస్థలో నిర్వహించే ప్రత్యేకతతో ప్రపంచ స్థాయిలో విశిష్ట సదుపాయంగా ఇది నిలవనుంది.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రతిపాదించిన స్వయం సమృద్ధ భారత్ సంకల్పానికి ఈ ప్రాజెక్టు ప్రతీకగా నిలుస్తుందని ఆయన అభివర్ణించారు. దేశీయ పరిశ్రమలు, విద్యాసంస్థలు, ఎంఎస్ఎంఈలు, యువత, పరిశోధకుల సమిష్టి కృషితో రక్షణ రంగంలో స్వావలంబన సాధ్యమవుతోందని తెలిపారు.

ఈ సందర్భంగా సమీర్ వి కామత్ డీఆర్‌డీఓ పరిశోధనల వివరాలను మంత్రి ముందు ఉంచారు. పర్యటనలో భాగంగా 'సీ కీపింగ్ అండ్ మెనూవరింగ్ బేసిన్'ను సందర్శించిన మంత్రి, టార్పిడోలు, డెకాయ్ వ్యవస్థలు, ఆటోనమస్ అండర్‌వాటర్ వాహనాల ప్రదర్శనను వీక్షించారు. ఆధునిక జలాంతర్గత సాంకేతికతల్లో భారత్ సాధిస్తున్న పురోగతిని ఈ ప్రదర్శనలు స్పష్టం చేశాయి.



నావికాదళానికి అవసరమైన అధునాతన సాంకేతికతల అభివృద్ధిలో ఎన్ఎస్‌టీఎల్ కీలక పాత్ర పోషిస్తోందని రాజ్‌నాథ్ సింగ్ ప్రశంసించారు. స్వార్మ్ సాంకేతికత, లిథియం-అయాన్ బ్యాటరీ తయారీలో సాధించిన పురోగతిని కూడా అభినందించారు. ఈ సాంకేతికతలు భవిష్యత్ యుద్ధ సన్నద్ధతకు కీలకమని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో అనిల్ చౌహాన్, దినేష్ కె త్రిపాఠీ, సంజయ్ భల్లా సహా పలువురు సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

'లార్జ్ కేవిటేషన్ టన్నెల్'ను వ్యూహాత్మక జాతీయ మౌలిక సదుపాయంగా పరిగణిస్తున్నారు. భవిష్యత్ యుద్ధ నౌకలు, జలాంతర్గాముల రూపకల్పన, తయారీకి ఇది దోహదం చేస్తుంది. హైడ్రో డైనమిక్ పరిశోధనలో స్వదేశీ సామర్థ్యాన్ని పెంచడంలో ఇది కీలక మలుపు కానుంది. క్లోజ్డ్-లూప్, ఫ్రీ సర్ఫేస్ సిమ్యులేషన్‌లను



# రూర్కెలాలో శాస్త్ర, సాంస్కృతిక కేంద్రాల ప్రారంభం




ద్రౌపది ముర్ము రూర్కెలాలో ప్లానెటేరియం, సైన్స్ సెంటర్, నిర్మల్ ముండా పరివేశ్ పథ్‌ను ప్రజా కార్యక్రమంలో ప్రారంభించారు. అనంతరం ట్రైబల్ మ్యూజియం, ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌ను కూడా ప్రారంభించారు.

ఈ సందర్భంగా మాట్లాడిన రాష్ట్రపతి సుందర్‌గఢ్ ప్రాంతంలోని సహజ సౌందర్యం, జానపద సంస్కృతి, వారసత్వం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయని చెప్పారు. అడవులు, కొండలు, జలపాతాలు, నదులు ఈ ప్రాంతానికి ప్రత్యేక గుర్తింపునిస్తాయని పేర్కొన్నారు. ఇక్కడి కళలు, సంస్కృతి ఒడిశా వైవిధ్యాన్ని మరింతగా పెంచాయని తెలిపారు. సుందర్‌గఢ్ ధైర్యవంతులైన వ్యక్తులు, క్రీడాకారుల భూమిగా నిలిచిందని అన్నారు.

రూర్కెలా నగరం దేశంలోని పలు ప్రాంతాల ప్రజలు జీవనోపాధి కోసం నివసించే సమ్మిళిత నగరమని పేర్కొన్నారు. ఈ నగరం ఒడిశా కళ, సాహిత్యం, సంస్కృతి, గిరిజన సంప్రదాయాలు, క్రీడల ప్రోత్సాహంలో ముందంజలో ఉందని తెలిపారు.

సమాజంలోని ప్రతి వర్గం అభివృద్ధి చెందితేనే దేశ అభివృద్ధి సాధ్యమని ఆమె స్పష్టం చేశారు. గిరిజన సంక్షేమం కోసం కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు పలు పథకాలను అమలు చేస్తున్నాయని చెప్పారు. దీంతో సుందర్‌గఢ్ వంటి గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధి వేగవంతమవుతుందని, గిరిజనుల ఆర్థిక స్థితి మెరుగుపడుతోందని పేర్కొన్నారు.

ప్రజలు దేశ అభివృద్ధిలో చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ముందుకు సాగుతూ ఇతరులను కూడా ముందుకు తీసుకువెళ్లాలని సూచించారు. మంచి మనుషులుగా మారి వెనుకబడినవారిని పైకి తీసుకురావాలని కోరారు.

2047 నాటికి అభివృద్ధి చెందిన భారత్ లక్ష్యంగా దేశం వేగంగా ముందుకు సాగుతోందని తెలిపారు. 2036లో ఒడిశా రాష్ట్ర ఆవిర్భావానికి వందేళ్లు పూర్తవుతాయని గుర్తుచేశారు. అభివృద్ధి చెందిన ఒడిశా, భారత్ నిర్మాణానికి సమగ్ర అభివృద్ధి, ప్రజల భాగస్వామ్యం అత్యవసరమని చెప్పారు. రైతులు, కార్మికులు, గిరిజనులు, అణగారిన వర్గాలు, మేధావులు, యువత, విద్యార్థులు, పట్టణ, గ్రామీణ ప్రజల సమిష్టి కృషితోనే ఈ లక్ష్యం సాధ్యమవుతుందని పేర్కొన్నారు.



# హైదరాబాద్ మెట్రోపై రాష్ట్ర ప్రభుత్వ పూర్తి నియంత్రణ



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్ మెట్రో రైలు సేవలను పూర్తిగా తన ఆధీనంలోకి తీసుకుంది. ఇప్పటివరకు ఎల్ అండ్ టీ సంస్థ నిర్వహిస్తున్న ఈ మెట్రో వ్యవస్థను రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడానికి ఒప్పందం కుదిరింది.

ఈ ప్రక్రియలో భాగంగా ఎల్ అండ్ టీ మెట్రో రైలు హైదరాబాద్ లిమిటెడ్ సంస్థకు చెందిన వంద శాతం ఈక్విటీ షేర్లను రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసింది. మొత్తం లావాదేవీ విలువ రూ. 1,461.47 కోట్లు గా నిర్ణయించారు. ఈ మేరకు షేర్ కొనుగోలు ఒప్పందంపై అధికారులు సంతకాలు చేశారు.

రాష్ట్ర కార్యదర్శాలయంలో జరిగిన సమావేశంలో హైదరాబాద్ మెట్రో రైలు లిమిటెడ్ ఛైర్మన్ కే. రామకృష్ణ రావు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, నిర్వహణ సంచాలకుడు సర్ఫరాజ్ అహ్మద్ తో పాటు ఎల్ అండ్ టీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఒప్పందం ప్రకారం ఎల్ అండ్ టీ మెట్రో రైలు హైదరాబాద్ లిమిటెడ్ సంస్థపై ఉన్న సుమారు రూ. 13,538.53 కోట్ల అప్పును రాష్ట్ర ప్రభుత్వ హామీతో పునర్వ్యవస్థీకరించనున్నారు. ఈ వ్యవహారంలో ఐడీబీఐ మూలధనం సలహాదారుగా వ్యవహరించగా, న్యాయ సలహా సేవలను సరాఫ్ అండ్ పార్ట్నర్స్ సంస్థ అందించింది.

## ప్రయాణికులకు మెరుగైన సేవలు

2017 నవంబర్ నుండి మూడు మార్గాల్లో సుమారు 69 కిలోమీటర్ల మేర మెట్రో సేవలు అందుతున్నాయి. ప్రస్తుతం రోజుకు దాదాపు 4.5 లక్షల మంది ప్రయాణికులు మెట్రోను వినియోగిస్తున్నారు. ప్రారంభం నుండి ఇప్పటి వరకు మొత్తం ప్రయాణాల సంఖ్య సుమారు 86 కోట్లకు చేరుకుంది.

రాష్ట్ర ప్రభుత్వం ఆధీనంలోకి వచ్చిన తర్వాత తొలి దశ సేవలను ప్రతిపాదిత రెండో దశ విస్తరణతో అనుసంధానం చేయడం సులభమవుతుంది. దీని ద్వారా ప్రణాళిక, అమలు, సేవల నాణ్యత మరింత మెరుగుపడే అవకాశం ఉంది. ప్రయాణికులకు మరింత సౌకర్యవంతమైన, నమ్మకమైన రవాణా వ్యవస్థ అందుబాటులోకి రానుంది.

## ముఖ్యమంత్రితో చర్చలు

ఒప్పందానికి ముందు ఎల్ అండ్ టీ ఛైర్మన్ ఎస్.ఎన్. సుబ్రహ్మణ్యన్ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి ని కలిశారు. ఈ సందర్భంగా పలు ముఖ్య అంశాలపై చర్చించారు.



# సరస్వతి అంత్య పుష్కరాలు
# మే 21 నుంచి జూన్ 1 వరకు




రాష్ట్ర ఎండోమెంట్స్, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ సరస్వతి అంత్య పుష్కరాలను ఘనంగా నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబుతో కలిసి సచివాలయంలో అధికారిక పోస్టర్, టీజర్‌ను ఆవిష్కరించారు.

మే 21 నుంచి జూన్ 1 వరకు 12 రోజుల పాటు కాళేశ్వరంలో ఈ పుష్కరాలు నిర్వహించనున్నారు. మొత్తం 162 పనులతో ?30.63 కోట్ల అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. భక్తులు పవిత్ర స్నానం చేయడానికి, దర్శనం పొందడానికి ప్రశాంత వాతావరణంలో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. సుమారు 30 లక్షల మంది భక్తులు హాజరయ్యే అవకాశం ఉందని అంచనా.

ప్రస్తుత ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సరస్వతి ఆది పుష్కరాలు, సమ్మక్క సారలమ్మ జాతర విజయవంతంగా నిర్వహించామని, వచ్చే ఏడాది గోదావరి పుష్కరాల కోసం ఇప్పటికే సిద్ధతలు ప్రారంభించినట్లు మంత్రి తెలిపారు.

మంత్రి డి. శ్రీధర్ బాబు అధికారులు అన్ని ఏర్పాట్లు కనీసం 10 రోజుల ముందే పూర్తి చేయాలని, శాఖల మధ్య సమన్వయం ఉండేలా చూడాలని, ముఖ్యంగా ట్రాఫిక్ సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కాళేశ్వరం ఆలయ అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ?198 కోట్లు మంజూరు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎండోమెంట్స్ శాఖ ప్రధాన కార్యదర్శి శైలజా రామయ్యర్ మాట్లాడుతూ, మొదటి రోజు ఉదయం 5:43 గంటలకు ప్రారంభ పుణ్యస్నానం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని శంకర విజయేంద్ర సరస్వతి నిర్వహించనున్నారు. గవర్నర్‌కు ఆహ్వానం పంపినట్లు చెప్పారు. ప్రతిరోజూ ఒక సన్యాసి పుణ్యస్నానం చేసేలా ఏర్పాట్లు చేశామని తెలిపారు.

ప్రతిరోజూ సాయంత్రం 6:30 గంటలకు త్రివేణి సంగమంలో వారణాసి పూజారులతో హారతి నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ రాహుల్ శర్మ, ఆలయ ట్రస్ట్ చైర్మన్ మోహన్ శర్మ, ఎండోమెంట్స్ శాఖ అధికారులు పాల్గొన్నారు.



# ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్ట్ నిర్మాణానికి కట్టుబడి ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం



ప్రాణహిత--చేవెళ్ల ప్రాజెక్ట్ నిర్మాణానికి కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి N. Uttam Kumar Reddy తెలిపారు. ఎన్నికల హామీ మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు వెల్లడించారు.

తుమ్మిడిహట్టి నుంచి ఎల్లంపల్లి వరకు నీటిని మళ్లించి లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. అదే అలైన్‌మెంట్‌పై ప్రత్యామ్నాయ ప్రతిపాదనలను కూడా పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆర్వీ అసోసియేట్స్, IIT Hyderabad కలిసి నాలుగు ప్రతిపాదనలు సమర్పించినట్లు తెలిపారు. వాటిని ఖర్చు, సాధ్యత, ప్రయోజనాలు, పరిమితులు వంటి అంశాలపై సమగ్రంగా విశ్లేషిస్తున్నామని చెప్పారు. ఈ ప్రతిపాదనలపై ఈరోజే ముఖ్యమంత్రి Revanth Reddy తో సమావేశంలో తుది నిర్ణయం తీసుకోనున్నట్లు వెల్లడించారు.

కుందన్‌బాగ్‌లోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో తుమ్మిడిహట్టి--ఎల్లంపల్లి ప్రత్యామ్నాయ మార్గాలపై, మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీల పునరుద్ధరణ పనులపై ప్రత్యేక సమీక్ష నిర్వహించారు.

వర్షాకాలం ప్రారంభానికి ముందే పునరుద్ధరణ పనులకు సంబంధించిన అన్ని పరీక్షలను పూర్తి చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ప్రతి 1.5 మీటర్లకు ఒకసారి ప్రామాణిక ప్రవేశ పరీక్షలు (ఎస్పీటీ), ప్రతి 3 మీటర్లకు పారగమ్యత పరీక్షలు నిర్వహించాలని సూచించారు. త్రవ్వకాల సమయంలో రాయి ఎదురైనా బోర్ హోల్స్‌ను కనీసం 5 మీటర్ల లోతు వరకు కొనసాగించాలని స్పష్టం చేశారు.

బ్యారేజీల పునరుద్ధరణ కోసం ఏర్పాటు చేసిన సమన్వయ కమిటీ స్థలాలను సందర్శించి గడువులను నిర్ణయించాలని ఆదేశించారు. పునరుద్ధరణ పనులు వేగంగా పూర్తి కావడానికి కేంద్ర జల, విద్యుత్ పరిశోధనా కేంద్రం డైరెక్టర్ అక్కడే ఉండాలని సూచించారు.

పరీక్షలు, పునరుద్ధరణ పనుల పురోగతిపై జాతీయ డ్యామ్ భద్రతా ప్రాధికార సంస్థకు నిరంతరం నివేదికలు పంపాలని మంత్రి ఆదేశించారు.

ఈ సమావేశంలో నీటిపారుదల ప్రధాన కార్యదర్శి ఇ. శ్రీధర్, సహాయ కార్యదర్శి కే. శ్రీనివాస్, ఈఎన్సీ రమేష్ బాబు, జయశంకర్ భూపాలపల్లి కలెక్టర్ రోహిత్ శర్మ, ఆర్వీ అసోసియేట్స్, ఐఐటీ హైదరాబాద్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# జవహర్ బాల భవన్‌కు రూ.19.32 లక్షల పరిపాలనా అనుమతి



తెలంగాణ ప్రభుత్వం పాఠశాల విద్యాశాఖ ద్వారా జవహర్ బాల భవన్‌కు రూ.19,32,000 నిధులను మంజూరు చేసింది. 2026-27 బడ్జెట్ అంచనాల్లో భాగంగా ఈ మొత్తానికి పరిపాలనా అనుమతి ఇస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

ఫైనాన్స్ శాఖ విడుదల చేసిన బడ్జెట్ రిలీజ్ ఆర్డర్ మేరకు ఈ నిధులను జవహర్ బాల భవన్‌లో స్థాపన ఖర్చుల కోసం వినియోగించనున్నారు. దీనికి సంబంధించిన జి.ఓ. ఆర్.టి. నం.77 ద్వారా ప్రభుత్వం అధికారికంగా అనుమతి ఇచ్చింది.

ఈ నిధుల వినియోగంపై అవసరమైన చర్యలు తీసుకోవాలని జవహర్ బాల భవన్ డైరెక్టర్‌కు ప్రభుత్వం సూచించింది. సంబంధిత శాఖలైన ట్రెజరీలు, ఖాతాల శాఖ, వర్క్స్ అండ్ అకౌంట్స్ శాఖ, పే అండ్ అకౌంట్స్ కార్యాలయాలకు కూడా ప్రతులు పంపించారు. ప్రభుత్వ కార్యదర్శి డా. యోగితా రాణా ఆదేశాల మేరకు ఈ ఉత్తర్వులు అమల్లోకి వచ్చాయి.









# బీసీ సంక్షేమానికి రూ.550.10 కోట్ల పరిపాలనా అనుమతి




**బీసీ సంక్షేమ శాఖకు చెందిన పథకాల అమలుకు రాష్ట్ర ప్రభుత్వం భారీగా నిధులు మంజూరు చేసింది. 2026-27 బడ్జెట్ అంచనాల కింద మొత్తం రూ.550 కోట్లు 10 లక్షల వ్యయానికి పరిపాలనా అనుమతి ఇచ్చింది. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.**

**ఆర్థిక శాఖ నుంచి విడుదలైన బడ్జెట్ రిలీజ్ ఆర్డర్ ఆధారంగా ఈ నిధులకు అనుమతి ఇవ్వబడింది. నెలవారీ పరిమితులు పాటిస్తూ ఖర్చులు నిర్వహించాలని సూచించింది. ఈ నిధులు ప్రధానంగా ప్రభుత్వ వసతి గృహాలు, బీసీ విద్యార్థుల కోసం నివాస పాఠశాలలు-జూనియర్ కళాశాలలకు వినియోగించబడనున్నాయి.**

**ముఖ్యంగా మహాత్మా జ్యోతిబా ఫూలే బీసీ సంక్షేమ విద్యాసంస్థల సంఘానికి సహాయం కోసం పెద్ద మొత్తంలో నిధులు కేటాయించారు. ప్రభుత్వ వసతి గృహాల నిర్వహణకు కూడా ప్రత్యేకంగా నిధులు మంజూరు చేశారు.**

**ఈ ఉత్తర్వుల ప్రకారం బీసీ సంక్షేమ కమిషనర్, సంబంధిత సంస్థల కార్యదర్శులు తదుపరి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది.**

## బీసీ సంక్షేమ శాఖకు రూ.104.91 కోట్ల పరిపాలనా అనుమతి

రాష్ట్ర ప్రభుత్వం బీసీ సంక్షేమ శాఖకు 2026-27 బడ్జెట్ అంచనాల కింద రూ.104 కోట్లు 91 లక్షలు 30 వేల నిధులకు పరిపాలనా అనుమతి మంజూరు చేసింది. ఈ మేరకు ప్రభుత్వం జీఓ ఆర్టీనంబర్ 49ను ఏప్రిల్ 24న విడుదల చేసింది. బడ్జెట్ విడుదల ఆదేశాల ప్రకారం ఈ నిధులు బడ్జెట్ అంచనాల మేర ఖర్చులకు వినియోగించుకోవాలని సూచించింది. అలాగే నిర్దిష్ట ఖాతాల కింద నెలవారీ పరిమితులను పాటిస్తూ ఖర్చులు చేయాలని స్పష్టం చేసింది. ఈ నిధుల్లో జిల్లా కార్యాలయాలకు రూ.9 లక్షలు, బీసీ కమిషన్‌కు రూ.21.6 లక్షలు కేటాయించారు. ప్రభుత్వ వసతిగృహాలకు రూ.23 కోట్లు 58 లక్షలు 90 వేల రూపాయలు, బీసీ రెసిడెన్షియల్ పాఠశాలలు, జూనియర్ కళాశాలల నిర్వహణకు రూ.81 కోట్లు 1 లక్ష 80 వేల రూపాయలు మంజూరు చేశారు. ఈ నిధుల వినియోగంపై బీసీ సంక్షేమ కమిషనర్, బీసీ కమిషన్ సభ్య కార్యదర్శి, ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్ఈఐఎస్ కార్యదర్శులు అవసరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. ఖజానా, లెక్కల శాఖలు, సంబంధిత అధికారులకు కూడా ఈ ఆదేశాలను పంపిస్తూ ప్రభుత్వం తదుపరి చర్యలు వేగవంతం చేయాలని సూచించింది.

# ఎస్ఐసీపీఎలో ఢిల్లీ జైలు సిబ్బందికి శిక్షణ ప్రారంభం




తెలంగాణ రాష్ట్ర కారాగార పరిపాలన సంస్థ ఎస్ఐసీపీఎలో ఢిల్లీ జైలు శాఖ సిబ్బందికి ప్రాథమిక ప్రవేశ శిక్షణ కార్యక్రమాన్ని రాష్ట్ర పోలీస్ మహానిరకుడు బి. శివధర్ రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయనను కారాగార సేవల విభాగాధిపతి సౌమ్య మిశ్రా అధికారులు, అధ్యాపక బృందంతో కలిసి స్వాగతించారు.

ఈ శిక్షణ కార్యక్రమం అంతర్రాష్ట్ర సహకారానికి ప్రతీకగా నిలుస్తోంది. 2026 సంవత్సరంలో మొత్తం 381 మంది ఢిల్లీ జైలు సిబ్బందికి విడతల వారీగా శిక్షణ ఇవ్వనున్నారు. మొదటి విడతలో 62 మంది శిక్షణార్థులు పాల్గొంటున్నారు. వీరిలో ఢిల్లీ జైలు శాఖకు చెందిన 61 మంది, తెలంగాణ జైలు శాఖకు చెందిన ఒక వార్డర్ ఉన్నారు. ఈ బృందంలో 18 మంది సహాయక సూపరింటెండెంట్లు, 43 మంది మహిళా వార్డర్లు ఉన్నారు. అదనంగా అండమాన్ నికోబార్ ప్రాంతానికి చెందిన ఒక వార్డర్ కూడా శిక్షణలో చేరనున్నాడు.

తొమ్మిది నెలలపాటు కొనసాగే ఈ శిక్షణలో సిద్ధాంత, ప్రాయోగిక అంశాలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. కారాగార నిర్వహణ నియమాలు, నేర శాస్త్రం, మానసిక శాస్త్రం, సమాజ శాస్త్రం, రాజ్యాంగ విలువలు, మానవ హక్కులు, సాంకేతిక వినియోగం వంటి అంశాలపై బోధన ఉంటుంది. శారీరక దృఢత్వం కోసం వ్యాయామం, పరేడ్, యోగా, ధ్యానం కూడా భాగంగా ఉంటాయి.

ఈ సందర్భంగా శివధర్ రెడ్డి మాట్లాడుతూ కారాగార శాఖ బాధ్యతలు సమాజానికి ఎంతో ముఖ్యమని తెలిపారు. జైలు సేవలు కేవలం భద్రతకు మాత్రమే పరిమితం కావని, ఖైదీల మార్పు, సమాజంలో తిరిగి కలపడం ప్రధాన లక్ష్యమని అన్నారు. శిక్షణార్థులు క్రమశిక్షణ, నిజాయితీ పాటిస్తూ ఖైదీలను గౌరవంగా చూడాలని సూచించారు.

సౌమ్య మిశ్రా మాట్లాడుతూ సంస్థాగత శిక్షణ, అంతర్రాష్ట్ర సహకారం కారాగార వ్యవస్థ బలోపేతానికి అవసరమని పేర్కొన్నారు. ఎస్ఐసీపీఎలో ఉన్నత ప్రమాణాలతో శిక్షణ అందుతుందనే నమ్మకంతో ఢిల్లీ నుంచి పెద్ద సంఖ్యలో సిబ్బందిని పంపినట్టు తెలిపారు. గతంలో టిహార్ జైళ్ల సిబ్బందికి నిర్వహించిన శిక్షణల విజయాన్ని కూడా గుర్తు చేశారు.

కార్యక్రమంలో అధ్యాపక బృందం కృషిని అభినందించారు. ఇదే సందర్భంగా శివధర్ రెడ్డి 60వ జన్మదినాన్ని సిబ్బంది ఘనంగా నిర్వహించారు.



# హైదరాబాద్‌లో హైనెకెన్ గ్లోబల్ సామర్థ్య కేంద్రం ప్రారంభం




రాష్ట్ర సమాచార సాంకేతికత, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు బుధవారం హైదరాబాద్ ఆర్థిక జిల్లా లో హైనెకెన్ సంస్థ ఏర్పాటు చేసిన కొత్త గ్లోబల్ సామర్థ్య కేంద్రాన్ని ప్రారంభించారు. సుమారు 76 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటైన ఈ కేంద్రం అంతర్జాతీయ స్థాయి సేవలకు ప్రధాన కేంద్రంగా పనిచేయనుంది.

ఈ కేంద్రం ద్వారా ఆర్థిక వ్యవహారాలు, డిజిటల్ సాంకేతికత, సాంకేతిక సేవలు, విశ్లేషణ రంగాలలో సేవలు అందించబడనున్నాయి. దీని ద్వారా హైదరాబాద్ గ్లోబల్ సామర్థ్య కేంద్రాల కేంద్రంగా మరింత బలపడుతుందని అధికారులు తెలిపారు.

ప్రారంభ దశలో 300కి పైగా ఉన్నత స్థాయి ఉద్యోగాలు సృష్టించబడనున్నాయి. రాబోయే సంవత్సరాల్లో ఈ సంఖ్య 1,600 వరకు పెరగనున్నట్లు అంచనా వేస్తున్నారు.

150 సంవత్సరాలకు పైగా చరిత్ర కలిగిన హైనెకెన్ ప్రపంచంలో ప్రముఖ మద్యం తయారీ సంస్థల్లో ఒకటిగా గుర్తింపు పొందింది. ఈ సంస్థ ఉత్పత్తులు 190కి పైగా దేశాల్లో అందుబాటులో ఉన్నాయి. 70కి పైగా దేశాల్లో 165కిపైగా కర్మాగారాలను నిర్వహిస్తూ విస్తృత స్థాయిలో కార్యకలాపాలు కొనసాగిస్తోంది.

# మంత్రి వాకిటి శ్రీహరి - కేంద్ర మంత్రి రాజీవ్ రంజన్ సింగ్‌తో సమావేశం





రాష్ట్ర పశుసంవర్ధక, పాలాభివృద్ధి, మత్స్యశాఖ, యువజన సేవలు, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి రాజేంద్రనగర్‌లోని జాతీయ మత్స్య అభివృద్ధి మండలి కార్యాలయంలో కేంద్ర మత్స్య, పశు సంవర్ధక, పాల పరిశ్రమల శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్‌ను కలిశారు.

ఈ సమావేశంలో మత్స్యశాఖ డైరెక్టర్ నిఖిల, పశుసంవర్ధక శాఖ అధికారి లక్ష్మీ నారాయణ సహా ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పశుసంవర్ధక, పాలాభివృద్ధి, మత్స్య రంగాల్లో అమలు అవుతున్న పథకాలపై మంత్రి శ్రీహరి కేంద్ర మంత్రికి వివరించారు. ఈ కార్యక్రమాల ఫలితాలు వివరించి, కేంద్ర ప్రభుత్వ సహకారం కొనసాగించాలని కోరారు.

మత్స్యకార అభివృద్ధి, జీవ భీమా పరిరక్షణ, మోపెడ్‌ల వంటి వనరుల సమాన పంపిణీ వంటి అంశాలపై చర్చ జరిగింది. ఈ ప్రతిపాదనలపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించి పరిశీలిస్తామని హామీ ఇచ్చారు.

రాష్ట్రాలకు సమానంగా నిధులు కేటాయించాల్సిన బాధ్యత కేంద్రానికి ఉందని మంత్రి శ్రీహరి తెలిపారు. గత ప్రభుత్వం కేంద్ర నిధులు సమర్థంగా తీసుకురావడంలో విఫలమైందని విమర్శించారు.

రాష్ట్ర అభివృద్ధి లక్ష్యాలపై దృష్టి సారిస్తూ, గోదావరి--కృష్ణా నదుల మధ్య ఉన్న 46 వేల ప్రధాన చెరువులు, 26 వేల చిన్న చెరువులు, 100 జలాశయాల అభివృద్ధిపై ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు.

రాజేంద్రనగర్ నుంచి జాతీయ మత్స్య అభివృద్ధి మండలి కార్యాలయం మార్పిడి జరుగుతుందనే అంశాన్ని మంత్రి ప్రస్తావించగా, అలాంటి ప్రతిపాదన లేదని కేంద్ర మంత్రి స్పష్టం చేసి, ఇదే ప్రాంతంలో కొనసాగుతుందని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి కేంద్ర మంత్రిని శాలువా, పుష్పగుచ్ఛం, జ్ఞాపికతో సత్కరించారు.



# శంకర్‌పల్లి సమీపంలో క్రేన్ ప్రమాదం: గాయపడిన వారిని పరామర్శించిన మంత్రి



శంకర్‌పల్లి సమీపంలో చోటుచేసుకున్న క్రేన్ ప్రమాదంలో గాయపడిన వారిని రాష్ట్ర కార్మిక, గనుల శాఖ మంత్రి డాక్టర్ జి. వివేక్ వెంకటస్వామి పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

జరిగిన ఈ ఘటనలో ఐదుగురు వలస కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. మరో 12 మంది గాయపడ్డారు. బలమైన గాలులు వీచడంతో ఎన్‌సీసీ సంస్థకు చెందిన నిర్మాణ క్రేన్ ఒక షెడ్‌పై కూలిపోయింది. వర్షం నుంచి తప్పించుకోవడానికి షెడ్‌లో ఆశ్రయం తీసుకున్న కార్మికులపై క్రేన్ పడటంతో ఈ ప్రమాదం సంభవించింది. ఘటన స్థలంలోనే ఐదుగురు మరణించగా, మరికొందరు ఎముకలు విరగడం సహా తీవ్రమైన గాయాలకు గురయ్యారు.

మంత్రి, ఎమ్మెల్యే కాలే యాదయ్యతో కలిసి ఆసుపత్రికి వెళ్లి గాయపడిన వారికి అందుతున్న చికిత్సపై సమీక్ష నిర్వహించారు. ఘటనపై సమగ్ర నివేదిక సమర్పించాలని అధికారులకు ఆదేశించారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాల సహాయం అందించేందుకు కట్టుబడి ఉందని మంత్రి తెలిపారు.



# అపోలో "ది హాస్పిటల్ ఆఫ్ గ్రాటిట్యూడ్" ప్రారంభం



ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి సోమవారం ఫైనాన్షియల్ జిల్లా లో అపోలో ఆసుపత్రుల "ది హాస్పిటల్ ఆఫ్ గ్రాటిట్యూడ్" ను ప్రారంభించారు. కార్యక్రమంలో మంత్రి దామోదర్ రాజనరసింహ పాల్గొన్నారు.

సభలో మాట్లాడిన ముఖ్యమంత్రి, అపోలో ఆసుపత్రులు 46 సంవత్సరాల క్రితం చెన్నైలో తొలి ఆసుపత్రితో ప్రారంభమై, ఆరోగ్య రంగంలో ప్రామాణికంగా ఎదిగిందని తెలిపారు. డాక్టర్ ప్రతాప్ సి. రెడ్డి భారతదేశంలో ఆధునిక ఆరోగ్య వసతుల అభివృద్ధికి కీలక పాత్ర పోషించారని, అపోలో పేరు లక్షలాది మందికి విశ్వాసానికి ప్రతీకగా మారిందని పేర్కొన్నారు.సమాజానికి సేవ చేయడంలో అపోలో ఆసుపత్రుల నిర్వహణను అభినందిస్తూ, ఆరోగ్య సేవలలో ఉన్నత ప్రమాణాలు నెలకొల్పినందుకు ప్రశంసించారు.

తెలంగాణ ప్రభుత్వ లక్ష్యాల గురించి మాట్లాడుతూ, హైదరాబాద్‌ను వైద్య పర్యాటకానికి గ్లోబల్ కేంద్రంగా అభివృద్ధి చేయడంపై దృష్టి పెట్టినట్లు తెలిపారు. చికిత్స కోసం వచ్చే రోగుల సౌకర్యార్థం మధ్యప్రాచ్య దేశాల నుంచి నేరుగా విమాన సౌకర్యం కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరినట్లు చెప్పారు. నాలుగో నగరంలో అంతర్జాతీయ హెల్త్ సిటీ ఏర్పాటు చేసే ప్రణాళికలు ఉన్నాయని వెల్లడించారు.

విమానాశ్రయం నుంచి ఆసుపత్రులకు రోగులను వేగంగా తరలించేందుకు గ్రీన్ చానల్ వ్యవస్థ ప్రవేశపెట్టే అంశంపై అధికారులతో చర్చలు జరుగుతున్నాయని తెలిపారు.

హైదరాబాద్ ఔషధ రంగంలో బలాన్ని ప్రస్తావిస్తూ, కోవిడ్-19 వ్యాక్సిన్లు ఇక్కడ తయారయ్యాయని, దేశంలో తయారయ్యే బల్క్ ఔషధాలలో దాదాపు 40 శాతం ఇక్కడే ఉత్పత్తి అవుతున్నాయని పేర్కొన్నారు.మంత్రి దామోదర్ రాజనరసింహను సామాజిక వైద్యుడిగా అభివర్ణిస్తూ, ప్రజల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తున్నారని తెలిపారు.ఆరోగ్య రంగానికి పూర్తి మద్దతు ఇస్తామని స్పష్టం చేస్తూ, పెట్టుబడులకు అనుకూల వాతావరణాన్ని ప్రభుత్వం కల్పిస్తుందని పేర్కొన్నారు. తెలంగాణను వ్యాపార, ఆరోగ్య పెట్టుబడులకు అనువైన గమ్యస్థానంగా పెట్టుబడిదారులు పరిశీలించాలని పిలుపునిచ్చారు.



# మహిళలు, పిల్లల భద్రత కోసం "స్పందన" బృందాల ప్రారంభం




రాష్ట్రంలో మహిళలు, పిల్లల భద్రతను మరింత బలోపేతం చేయడానికి "స్పందన" స్పందన బృందాలను ముఖ్యమంత్రి Revanth Reddy సమగ్ర నియంత్రణ కేంద్రంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రి Seethakka, డీజీపీ జీశివఅంవతీ (Shivadhar Reddy), హైదరాబాద్ పోలీస్ కమిషనర్ C. V. Anand పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ మహిళలు, పిల్లల భద్రతను కల్పించడం ప్రతి ప్రభుత్వపు ప్రాథమిక బాధ్యత అని తెలిపారు. మహిళలకు ప్రాధాన్యం ఇచ్చే దేశాలు వేగంగా అభివృద్ధి సాధిస్తాయని చెప్పారు. స్వాతంత్ర్యం అనంతరం భారతదేశంలో మహిళలకు ఓటు హక్కు ఇవ్వడం సమానత్వానికి నిదర్శనమని గుర్తు చేశారు.

రాష్ట్రంలో ఇప్పటికే అమల్లో ఉన్న షీ బృందాలు, "స్టాండ్ విత్ హర్" కార్యక్రమాలతో పాటు ఇప్పుడు ప్రారంభించిన "స్పందన" ద్వారా ఇరవై నాలుగు గంటల పాటు సేవలు అందించే బృందాలు మహిళలకు మానసిక, సంస్థాగత సహాయం అందిస్తాయని పేర్కొన్నారు. ఈ చర్యతో అవసర సమయంలో ప్రభుత్వం తమకు అండగా ఉంటుందనే నమ్మకం మహిళల్లో పెరుగుతుందని అన్నారు. మహిళా సాధికారత రాష్ట్ర అభివృద్ధిలో కీలకమని తెలిపారు. ఇంద్రమ్మ ఇళ్లు మహిళల పేర్లపై కేటాయించడం జరుగుతోందని, స్వయం సహాయక సమూహాల మహిళలకు 67 లక్షల మందికి 60 వేల కోట్లు బ్యాంకు రుణాలు అందించినట్టు చెప్పారు. ఒక కోటి మహిళలకు ఇంద్రమ్మ చీరలు పంపిణీ చేశామని, గత 28 నెలల్లో ఉచిత బస్సు ప్రయాణానికి 10 వేల కోట్లు ఖర్చు చేశామని వెల్లడించారు.

స్వయం సహాయక సమూహాలకు వెయ్యి బస్సులు కేటాయించి రవాణా సంస్థకు లీజుకు ఇచ్చినట్టు, మహిళా సమూహాలకు వెయ్యి మెగావాట్ల సౌర విద్యుత్ ప్రాజెక్టులు ఇచ్చినట్టు తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఇంద్రమ్మ క్యాంటీన్లు మహిళల చేత నిర్వహణలో ఉన్నాయని, జిల్లాల వారీగా భవనాల నిర్మాణం ద్వారా మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని చెప్పారు.

నారాయణపేటలో మహిళలు పెట్రోలు బంకులు నిర్వహిస్తున్నారని, 26 వేల ప్రభుత్వ పాఠశాలల నిర్వహణలో మహిళా సమూహాలు భాగస్వామ్యం అవుతున్నాయని, 26 లక్షల విద్యార్థులకు యూనిఫారాలు కుట్టే బాధ్యత కూడా సమూహాలకు అప్పగించినట్టు వివరించారు. మహిళా వ్యాపారులకు మద్దతుగా హైటెక్ సిటీ సమీపంలో మహిళా శక్తి స్టాళ్లు ఏర్పాటు చేసినట్టు, వారి ఉత్పత్తులను ఈ-వాణిజ్య వేదికల ద్వారా విక్రయించేలా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. 2034 నాటికి లక్ష కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దే లక్ష్యంలో మహిళల భద్రత కీలకమని పేర్కొన్నారు. మత్తు పదార్థాల దుర్వినియోగంపై ఆందోళన వ్యక్తం చేస్తూ, వాటి వల్ల మహిళలు, పిల్లలపై నేరాలు పెరుగుతున్నాయని అన్నారు. ఈ సమస్యను ఎదుర్కోవడానికి ఈగల్ దళాన్ని ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ప్రభావవంతులపై కూడా ఎలాంటి మినహాయింపులు లేకుండా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. చట్ట విరుద్ధ కార్యకలాపాలను సహించబోమని, నేరస్థులపై కఠిన చర్యలు కొనసాగుతాయని తెలిపారు. తెలంగాణను మహిళల భద్రతలో ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. ఈ సందర్భంగా "స్పందన" పోస్టర్‌ను కూడా విడుదల చేశారు.

# ఇందిరమ్మ ఇళ్ల వేగవంతం కలెక్టర్లకు అధిక అధికారాలు




రాష్ట్రంలో ప్రతిష్టాత్మక ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని వేగవంతం చేయాలని, జిల్లా కలెక్టర్లకు మరిన్ని అధికారాలు అప్పగిస్తున్నామని ఆదాయ, గృహ నిర్మాణ, సమాచార ప్రజాసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. అర్హులైన వారికి ఎప్పుడైనా దరఖాస్తు చేసుకునే అవకాశం ఉండేలా ఇళ్ల మంజూరు ప్రక్రియను నిరంతరంగా కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

హైదరాబాద్‌లో గృహ నిర్మాణ సంస్థ ప్రధాన కార్యాలయంలో సోమవారం జరిగిన సమీక్ష సమావేశంలో ఉమ్మడి నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాలకు చెందిన ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. నియోజకవర్గాల వారీగా సమస్యలను చర్చించి, వచ్చిన అంశాలపై తక్షణమే నిర్ణయాలు తీసుకుని అధికారులకు మార్గదర్శకాలు ఇచ్చారు.

పథక అమలుపై ప్రతి వారం సమీక్షలు నిర్వహించాలని కలెక్టర్లను ఆదేశించారు. భూమి స్థాయి సమస్యలు తగ్గించేందుకు ఉమ్మడి జిల్లాలకు ప్రత్యేక అధికారులను నియమిస్తామని తెలిపారు. గతంలో దరఖాస్తు చేయని వారు కూడా ఇప్పుడు దరఖాస్తు చేసుకుంటే అర్హత ఆధారంగా ఇళ్లు మంజూరు చేస్తామని చెప్పారు.

ప్రతి నియోజకవర్గానికి రాజకీయ భేదాభిప్రాయాలు లేకుండా 3,500 ఇళ్లను మంజూరు చేసినట్లు వెల్లడించారు. ఇళ్ల నిర్మాణం వేగంగా పూర్తయ్యేలా ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలని సూచించారు. లబ్ధిదారులు నిర్మాణం చేయలేని పరిస్థితుల్లో ఇతర అర్హులకు కేటాయించాలని పేర్కొన్నారు. బేస్‌మెంట్ దశ పూర్తయిన వెంటనే పెండింగ్ చెల్లింపులు విడుదల చేయాలని అధికారులను ఆదేశించారు.

గత ప్రభుత్వ కాలంలో ప్రారంభమైన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను పూర్తి చేసి తాగునీరు, విద్యుత్, మురుగు సదుపాయాలతో వెంటనే లబ్ధిదారులకు కేటాయించాలని చెప్పారు. పట్టణ ప్రాంతాల్లో భూమి కొరత దృష్ట్యా 400 నుంచి 600 చదరపు అడుగుల మధ్య జీ ప్లస్ ఒక మోడల్‌లో ఇళ్లు నిర్మించేందుకు అనుమతి ఇచ్చినట్లు తెలిపారు. భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం కోసం సమగ్ర సర్వే చేపడుతున్నామని తెలిపారు. ఐదు మండలాల్లో పైలట్ ప్రాజెక్టులుగా సర్వే మ్యాపుల ఆధారంగా రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయని చెప్పారు. సదా బైనామాల విషయంలో కొనుగోలుదారుడి ప్రకటనతోనే వేగంగా పరిష్కారం చేసేందుకు అధికారాన్ని రెవెన్యూ డివిజనల్ అధికారులకు ఇచ్చినట్లు తెలిపారు.

రాష్ట్రవ్యాప్తంగా దశలవారీగా కొత్త తహసీల్దార్ కార్యాలయ భవనాలు నిర్మిస్తామని, ప్రతి జిల్లా కేంద్రంలో ఆధునిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఆదాయ, అటవీ, ఎండోమెంట్, వక్ఫ్ శాఖల మధ్య ఉన్న సరిహద్దు వివాదాలను సంయుక్త సర్వే ద్వారా పరిష్కరిస్తామని వెల్లడించారు.

సమావేశంలో ఉమ్మడి జిల్లాల మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# జర్మనీ అవకాశాలపై దృష్టి


## విదేశీ ఉద్యోగాలకు నైపుణ్యాలు, భాషా శిక్షణ కీలకం



రాష్ట్ర కార్మిక, ఉపాధి, గనుల శాఖ మంత్రి డా. జీవీ వివేక్ వెంకటస్వామి విదేశీ ఉద్యోగాల కోసం యువతను సన్నద్ధం చేయడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు సూచించారు. ముఖ్యంగా జర్మనీ వంటి దేశాల్లో అవకాశాలను అందిపుచ్చుకునేందుకు నైపుణ్యాభివృద్ధి, భాషా ప్రావీణ్యం అత్యంత అవసరమని తెలిపారు. రాష్ట్రంలోని చదువుకున్న యువతలో విదేశీ ఉపాధిపై ఆసక్తి పెంచేందుకు, కొంతమందిని విజయవంతంగా విదేశాలకు పంపించడం కీలకమని పేర్కొన్నారు. ఈ విజయాలు మరింత మంది యువతకు ప్రేరణగా నిలుస్తాయని చెప్పారు. శిక్షణ వ్యవస్థను బలోపేతం చేయాలంటే శిక్షకులకు శిక్షణ ఇవ్వడం అవసరమని, నైపుణ్యంతో కూడిన భాషా ఉపాధ్యాయులను వెంటనే నియమించాలని ఆదేశించారు. ముఖ్యంగా జర్మన్ భాషా శిక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. సచివాలయంలో జరిగిన తెలంగాణ ఓవర్సీస్ మాన్‌పవర్ కంపెనీ సమావేశానికి అధ్యక్షత వహిస్తూ విదేశీ ఉపాధికి సంబంధించిన పలు అంశాలను సమీక్షించారు. జర్మనీలో నైపుణ్యంతో కూడిన కార్మికులు, చదువుకున్న యువతకు విస్తృత అవకాశాలు ఉన్నాయని పేర్కొంటూ, ఈ అవకాశాలను వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. విదేశాల్లో పనిచేస్తున్న కార్మికుల నుంచి నిరంతరం అభిప్రాయాలు సేకరించి, వ్యవస్థను మెరుగుపరచాలని అధికారులకు ఆదేశించారు. ప్రతి దేశానికి ప్రత్యేక సంస్కృతి ఉంటుందని, యువతకు సంస్కృతి సంబంధిత అవగాహన కూడా కల్పించాలని చెప్పారు. లక్ష్యాల ఆధారంగా శిక్షణ, నియామకాలపై ప్రణాళికలు రూపొందించాలని సూచిస్తూ, తెలంగాణ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలవాలని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం యువతకు గ్లోబల్ ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు. ఈ సమావేశంలో కార్యదర్శి డి. హరిచందన, కార్మిక కమిషనర్ పమేలా సత్పతి, ఉపాధి శిక్షణ డైరెక్టర్ నిర్మల కాంతి వెస్లీ, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



# పర్యావరణ పరిరక్షణపై విద్యా కార్యక్రమాలు ప్రారంభం





పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంచేందుకు పాఠశాలలు, సమాజంలో వివిధ విద్యా కార్యక్రమాలను అమలు చేయాలని సూచనలు వెలువడ్డాయి. ఈ కార్యక్రమాలను తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి రూపొందించిన మార్గదర్శకాల ప్రకారం చేపట్టాలని అధికార వర్గాలు తెలిపాయి.


ఈ కార్యక్రమాల్లో ముఖ్యంగా నీటి పరిరక్షణ, వ్యర్థాల తగ్గింపు, విద్యుత్ ఆదా, ఈ–వేస్ట్ నియంత్రణ వంటి అంశాలకు ప్రాధాన్యం ఇచ్చారు. నీటి వినియోగంపై సర్వేలు నిర్వహించడం, లీకేజీలను గుర్తించి మరమ్మతులు చేయడం, వర్షపు నీటి సంరక్షణ మోడళ్లను ప్రోత్సహించడం వంటి చర్యలు చేపట్టాలని సూచించారు.

అలాగే వ్యర్థాల తగ్గింపులో భాగంగా 3ఆర్ పద్ధతి (తగ్గించు, మళ్లీ వాడు, పునర్వినియోగం)పై శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు. పేపర్ రీసైక్లింగ్, కాంపోస్టింగ్ పద్ధతులను విద్యార్థులకు నేర్పించాలని సూచించారు.

విద్యుత్ ఆదా కోసం అవసరం లేని సమయంలో విద్యుత్ వినియోగాన్ని నిలిపివేయడం, సౌర శక్తి వినియోగంపై అవగాహన కల్పించడం వంటి చర్యలు తీసుకోవాలని తెలిపారు. పాత ఎలక్ట్రానిక్ పరికరాల వల్ల కలిగే ఈ–వేస్ట్ సమస్యపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

ఆరోగ్యకర జీవనశైలి, సుస్థిర ఆహార వ్యవస్థలు, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ తగ్గింపు వంటి అంశాలపై కూడా విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్థానిక ప్రజలు కలిసి ఈ కార్యక్రమాలను అమలు చేస్తే పర్యావరణ పరిరక్షణలో మంచి ఫలితాలు సాధ్యమవుతాయని అధికారులు పేర్కొన్నారు.





# ఇ-వ్యర్థాల (నిర్వహణ) నియమాలు, 2022




భారత ప్రభుత్వం పర్యావరణ, అరణ్య మరియు వాతావరణ మార్పు మంత్రిత్వ శాఖ ద్వారా 2022 నవంబర్ 2న ఈ నియమాలను ప్రకటించింది. ఈ నియమాలు 2023 ఏప్రిల్ 1 నుండి అమల్లోకి వస్తాయి.

అధ్యాయం 1: పరిచయం

1. సంక్షిప్త పేరు మరియు ప్రారంభం

1. ఈ నియమాలను "ఇ-వ్యర్థాల (నిర్వహణ) నియమాలు, 2022" అని పిలుస్తారు.

2. ఇవి 2023 ఏప్రిల్ 1 నుండి అమలులోకి వస్తాయి.

అధ్యాయం 2: వర్తింపు

ఈ నియమాలు క్రింది వారికి వర్తిస్తాయి:

తయారీదారులు

విద్యుత్ మరియు ఎలక్ట్రానిక్ పరికరాల ఉత్పత్తిదారులు

మరమ్మత్తుదారులు (రిఫర్బిషర్లు)

విడదీసే సంస్థలు (డిస్మాంటర్లు)

రీసైక్లర్లు

ఇవి ఎలక్ట్రానిక్ పరికరాల తయారీ, అమ్మకం, కొనుగోలు, రీసైక్లింగ్, ప్రాసెసింగ్ వంటి కార్యకలాపాలలో పాల్గొనే వారందరికీ వర్తిస్తాయి.

వర్తించని అంశాలు:

బ్యాటరీ వ్యర్థాలు (ప్రత్యేక నియమాల కింద వస్తాయి)

ప్లాస్టిక్ ప్యాకేజింగ్ వ్యర్థాలు

సూక్ష్మ సేవా రంగ సంస్థలు

రేడియోధార్మిక వ్యర్థాలు

ముఖ్య నిర్వచనాలు

ఇ-వ్యర్థం (E-waste): వాడిపోయిన లేదా పారవేసిన ఎలక్ట్రానిక్ పరికరాలు

విస్తృత ఉత్పత్తిదారుడి బాధ్యత (EPR): తయారీదారుడు తన ఉత్పత్తి వల్ల వచ్చే వ్యర్థాలను సేకరించి రీసైకిల్ చేయాల్సిన బాధ్యత

విద్యుత్ మరియు ఎలక్ట్రానిక్ పరికరాలు: విద్యుత్ లేదా ఎలక్ట్రోమ్యాగ్నెటిక్ శక్తిపై పనిచేసే పరికరాలు

అధ్యాయం 3: బాధ్యతలు

తయారీదారుల బాధ్యతలు:

అధికారిక పోర్టల్‌లో నమోదు కావాలి

తయారీ సమయంలో వచ్చిన వ్యర్థాలను సేకరించి రీసైకిల్ చేయాలి

నివేదికలు సమర్పించాలి

ఉత్పత్తిదారుల బాధ్యతలు:

EPR లక్ష్యాలను చేరుకోవాలి

ప్రజల్లో అవగాహన పెంచాలి

కాలానుగుణంగా నివేదికలు ఇవ్వాలి


రిఫర్బిషర్ల బాధ్యతలు:

రిజిస్ట్రేషన్ తప్పనిసరి

వ్యర్థాలను సేకరించి రీసైక్లర్లకు ఇవ్వాలి

రీసైక్లర్ల బాధ్యతలు:

ప్రమాణాలకు అనుగుణంగా రీసైక్లింగ్ చేయాలి




రికార్డులు నిర్వహించాలి
వ్యర్థాలను సురక్షితంగా నిర్వహించాలి
ముఖ్య అంశాలు
ఇ-వ్యర్థాలను గరిష్టంగా 180 రోజులు మాత్రమే నిల్వ ఉంచవచ్చు
అవసరమైతే 365 రోజుల వరకు పొడిగింపు ఉంటుంది
ప్రమాదకర పదార్థాల వినియోగం తగ్గించాలి
నియమాలు ఉల్లంఘిస్తే పర్యావరణ పరిహారం విధించబడుతుంది
అధ్యాయం 1: పరిచయం
1. సంక్షిప్త పేరు మరియు అమలు
1. ఈ నియమాలను లిఇ-వ్యర్థాల (నిర్వహణ) నియమాలు, 2022 అని పిలుస్తారు.
2. ఇవి 2023 ఏప్రిల్ 1 నుండి అమల్లోకి వస్తాయి.
అధ్యాయం 2: వర్తింపు
ఈ నియమాలు క్రింది వారందరికీ వర్తిస్తాయి:
తయారీదారులు
ఉత్పత్తిదారులు
రిఫర్బిషర్లు (మరమ్మత్తు చేసి మళ్లీ విక్రయించే వారు)
డిస్మాంటలర్లు (విడదీసే సంస్థలు)
రీసైక్లర్లు
ఇవి కింది కార్యకలాపాలకు వర్తిస్తాయి:
ఎలక్ట్రానిక్ పరికరాల తయారీ
అమ్మకం, కొనుగోలు
నిల్వ, రవాణా
రీసైక్లింగ్, ప్రాసెసింగ్
వర్తించని అంశాలు:
బ్యాటరీ వ్యర్థాలు
ప్లాస్టిక్ ప్యాకేజింగ్ వ్యర్థాలు
సూక్ష్మ సేవా రంగ సంస్థలు
రేడియోధార్మిక వ్యర్థాలు
అధ్యాయం 3: నిర్వచనాలు
ఈ నియమాలలో ఉపయోగించిన ముఖ్య పదాలు:
1. చట్టం
"చట్టం" అంటే పర్యావరణ (రక్షణ) చట్టం, 1986
2. పెద్ద వినియోగదారు
ఒక ఆర్థిక సంవత్సరంలో కనీసం 1000 ఎలక్ట్రానిక్ పరికరాలు ఉపయోగించే సంస్థ
3. వ్యాపారం
తయారీ
అసెంబ్లీ
దిగుమతి
రీసైక్లింగ్
వ్యర్థాల నిర్వహణ
4. భాగం (Componeñ)
ఒక పరికరాన్ని రూపొందించే భాగాలు




5. వినియోగ పదార్థం (Consumable)
తయారీ లేదా ఉపయోగ సమయంలో పూర్తిగా వినియోగించే పదార్థం
6. డిస్మాంట్లర్
వాడిన పరికరాలను విడదీసే వ్యక్తి లేదా సంస్థ
7. పారవేత (Disposal)
రీసైక్లింగ్ కాని చర్యలు
భూమిలో పూడ్చడం
దహనం
8. ఉత్పత్తి జీవనాంతం
వాడిన పరికరం పనికిరాని దశకు చేరే సమయం
9. పర్యావరణపరంగా సురక్షిత నిర్వహణ
పర్యావరణం మరియు ఆరోగ్యానికి హాని లేకుండా వ్యర్థాలను నిర్వహించడం
10. ఎలక్ట్రానిక్ పరికరాలు
విద్యుత్ లేదా ఎలక్ట్రోమ్యాగ్నెటిక్ శక్తితో పనిచేసే పరికరాలు
11. ఇ-వ్యర్థం
వాడిపోయిన లేదా పారేసిన పరికరాలు
తయారీ సమయంలో తిరస్కరించిన పరికరాలు
12. విస్తృత ఉత్పత్తిదారుడి బాధ్యత (EPR)
తయారీదారు తన ఉత్పత్తి వల్ల వచ్చిన వ్యర్థాలను:
సేకరించాలి
రీసైకిల్ చేయాలి
పర్యావరణపరంగా సురక్షితంగా నిర్వహించాలి
13. సదుపాయం (Facility)
ఇ-వ్యర్థాల:
సేకరణ
నిల్వ
వేరు చేయడం
రీసైక్లింగ్
చేసే స్థలం
14. తయారీదారు
తన బ్రాండ్‌లో పరికరాలు తయారు చేసి అమ్మే వ్యక్తి లేదా సంస్థ
15. రీసైక్లర్
విలువైన లోహాలను తిరిగి పొందే సంస్థ
16. రిఫర్బిషర్
పరికరాలను మరమ్మత్తు చేసి మళ్లీ ఉపయోగానికి సిద్ధం చేసే వ్యక్తి
అధ్యాయం 4: నమోదు (Registration)
ప్రతి సంస్థ తప్పనిసరిగా పోర్టల్‌లో నమోదు కావాలి:
తయారీదారు
ఉత్పత్తిదారు
రిఫర్బిషర్
రీసైక్లర్
ముఖ్య నిబంధనలు:
రిజిస్ట్రేషన్ లేకుండా వ్యాపారం చేయరాదు
తప్పు సమాచారం ఇస్తే రిజిస్ట్రేషన్ రద్దు
పర్యావరణ పరిహారం విధించబడుతుంది
అధ్యాయం 5: తయారీదారుల బాధ్యతలు
తయారీదారులు:
పోర్టల్‌లో నమోదు కావాలి
తయారీ సమయంలో వచ్చిన వ్యర్థాలను సేకరించాలి
రీసైక్లింగ్ లేదా సురక్షిత పారవేత చేయాలి
వార్షిక నివేదికలు సమర్పించాలి
అధ్యాయం 6: ఉత్పత్తిదారుల బాధ్యతలు
EPR లక్ష్యాలను సాధించాలి
అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి
నివేదికలు సమర్పించాలి
అధ్యాయం 7: రిఫర్బిషర్ల బాధ్యతలు
రిజిస్ట్రేషన్ తప్పనిసరి
వ్యర్థాలను సేకరించి రీసైక్లర్లకు ఇవ్వాలి
నాణ్యత ప్రమాణాలు పాటించాలి
అధ్యాయం 8: పెద్ద వినియోగదారుల బాధ్యతలు
ఇ-వ్యర్థాలను కేవలం నమోదిత సంస్థలకు మాత్రమే ఇవ్వాలి
అధ్యాయం 9: రీసైక్లర్ల బాధ్యతలు
ప్రమాణాలకు అనుగుణంగా పని చేయాలి
రికార్డులు నిర్వహించాలి

# E-WASTE



వ్యర్థాలను సురక్షితంగా ప్రాసెస్ చేయాలి
అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి
ఇ-వ్యర్థాల (నిర్వహణ) నియమాలు, 2022

భాగం--2
అధ్యాయం 10: రాష్ట్ర ప్రభుత్వం / కేంద్ర పాలిత ప్రాంతాల బాధ్యతలు
రాష్ట్ర ప్రభుత్వం లేదా కేంద్ర పాలిత ప్రాంతాల ప్రభుత్వాలు:
పరిశ్రమల పార్కులు, ప్రాంతాల్లో లిలిఇ-వ్యర్థాల రీసైక్లింగ్ కోసం స్థలాలను కేటాయించాలి
ఇ-వ్యర్థాల రంగంలో పనిచేసే కార్మికులకు:
నమోదు (రిజిస్ట్రేషన్) చేయాలి
శిక్షణ ఇవ్వాలి
నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించాలి
కార్మికుల ఆరోగ్యం, భద్రతపై పర్యవేక్షణ చేయాలి
అధ్యాయం 11: ఇ-వ్యర్థాల నిల్వ
తయారీదారులు, ఉత్పత్తిదారులు, రిఫర్బిషర్లు, రీసైక్లర్లు
ఇ-వ్యర్థాలను లిలిగరిష్టంగా 180 రోజులు మాత్రమే నిల్వ ఉంచవచ్చు
అవసరమైతే:
కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి అనుమతితో 365 రోజుల వరకు పొడిగించవచ్చు

నిల్వకు సంబంధించిన రికార్డులు తప్పనిసరిగా నిర్వహించాలి
అధ్యాయం 12: సౌర ఫోటో వోల్టాయిక్ ప్యానెల్ నిర్వహణ
సౌర ప్యానెల్, మాడ్యూల్, సెల్‌లకు ప్రత్యేక నియమాలు:
పోర్టల్‌లో నమోదు తప్పనిసరి
2034--2035 వరకు వచ్చే వ్యర్థాలను నిల్వ చేయాలి
ప్రతి సంవత్సరం నివేదిక సమర్పించాలి
కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి మార్గదర్శకాలు పాటించాలి
సౌర ప్యానెల్ వ్యర్థాల రీసైక్లింగ్ తప్పనిసరిలి
అధ్యాయం 13: విస్తృత ఉత్పత్తిదారుడి బాధ్యత (EPR) అమలు విధానం
ప్రతి ఉత్పత్తిదారు:
తన EPR లక్ష్యాలను చేరుకోవాలి
అవసరమైతే మూడవ పక్ష సంస్థల సహాయం తీసుకోవచ్చు
కానీ బాధ్యత పూర్తిగా లిలిఉత్పత్తిదారుడిపైనే ఉంటుందిలిలి
EPR లక్ష్యాలు:
ఉత్పత్తి జీవనకాలం
కేంద్ర సంస్థ నిర్ణయించిన ప్రమాణాలపై ఆధారపడి ఉంటాయి
అధ్యాయం 14: EPR సర్టిఫికేట్ సృష్టి
రీసైక్లింగ్ ద్వారా:
కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి పోర్టల్ ద్వారా సర్టిఫికేట్ ఇస్తుంది
గణన సూత్రం:
అర్హమైన పరిమాణం = ఉత్పత్తి పరిమాణం ఐ మార్పిడి గుణకం
సర్టిఫికేట్ వివరాలు:
ప్రత్యేక సంఖ్య ఉంటుంది 100, 200, 500, 1000 కిలోల పరిమాణాల్లో జారీ అవుతుంది
2 సంవత్సరాల పాటు చెల్లుతుంది
అధ్యాయం 15: EPR సర్టిఫికేట్ లావాదేవీలు
ఉత్పత్తిదారు:
ప్రస్తుత సంవత్సరం అవసరాలతో పాటు
గత సంవత్సరాల బకాయిలను కూడా తీర్చవచ్చు
సర్టిఫికేట్ కొనుగోలు చేసిన వెంటనే:
బాధ్యతకు అనుసంధానం అవుతుంది
నకిలీ సమాచారం ఉంటే: కఠిన చర్యలు తీసుకుంటారు



అధ్యాయం 16: ప్రమాదకర పదార్థాల వినియోగం తగ్గింపు
ఎలక్ట్రానిక్ పరికరాలలో ప్రమాదకర పదార్థాల వినియోగం పరిమితం చేయాలి:
అనుమతించిన గరిష్ట పరిమాణం:
సీసం (గాఘుు)
పాదరసం (వీవతీఎిబతీఎ)
కాడ్మియం (ఝుుఎఅబఎ)
హెక్సావాలెంట్ క్రోమియం
బ్రోమినేటెడ్ పదార్థాలు
వీటి పరిమాణం నిర్దిష్ట శాతం కంటే ఎక్కువ ఉండకూడదు

ముఖ్య నిబంధనలు:
2014 ముందు ఉన్న పరికరాలకు కొంత మినహాయింపు ఉంటుంది
తయారీదారు:
ప్రమాదకర పదార్థాల వివరాలు ఇవ్వాలి
వినియోగదారులకు సమాచారం అందించాలి
కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి:
నమూనాలు సేకరించి పరీక్షలు చేస్తుంది
నిబంధనలు పాటించకపోతే:
ఉత్పత్తిని మార్కెట్ నుంచి వెనక్కి తీసుకోవాలి

**ఇ-వ్యర్థాల (నిర్వహణ) నియమాలు, 2022**
భాగం--3 (చివరి భాగం)
అధ్యాయం 17: అధికారుల బాధ్యతలు
సంబంధిత అధికారులు ఈ నియమాల అమలు కోసం షెడ్యూల్--V లో పేర్కొన్న విధులను నిర్వహించాలి
అమలు, పర్యవేక్షణ, నియంత్రణ బాధ్యతలు చేపట్టాలి

అధ్యాయం 18: వార్షిక నివేదిక
కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి:
ప్రతి ఆర్థిక సంవత్సరం ముగిసిన తర్వాత
ఒక నెలలోపు నివేదిక సమర్పించాలి
ఈ నివేదికలో:
ఇ-వ్యర్థాల నిర్వహణ స్థితి
గణాంకాలు, విశ్లేషణలు ఉంటాయి
అధ్యాయం 19: రవాణా (Transpor)
ఇ-వ్యర్థాల రవాణా:
ప్రమాదకర వ్యర్థాల నియమాల ప్రకారం జరగాలి
సురక్షితంగా:
నిల్వ కేంద్రాలకు
శుద్ధి కేంద్రాలకు పంపాలి
అధ్యాయం 20: ప్రమాదాల నివేదిక
ఇ-వ్యర్థాల నిర్వహణ సమయంలో ప్రమాదం జరిగితే:
సంబంధిత వ్యక్తులు వెంటనే:
రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలికి
ఫోన్, ఈమెయిల్ ద్వారా సమాచారం ఇవ్వాలి

అధ్యాయం 21: అప్పీల్

రిజిస్ట్రేషన్ రద్దు లేదా తిరస్కరణపై అసంతృప్తి ఉంటే:
30 రోజుల్లోపు అప్పీల్ చేయవచ్చు
ఆలస్యమైతే: సరైన కారణం ఉంటే అంగీకరించవచ్చు
అధ్యాయం 22: పర్యావరణ పరిహారం (Environmental Compensation)
నిబంధనలు ఉల్లంఘించినట్లయితే:
జరిమానా విధించబడుతుంది



కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి నిర్ణయిస్తుంది
ముఖ్య అంశాలు:

బాధ్యతలు పూర్తి చేయకపోయినా జరిమానా నుంచి తప్పించుకోలేరు
EPR లక్ష్యాలు:
తదుపరి సంవత్సరాలకు కొనసాగుతాయి (గరిష్టంగా 3 సంవత్సరాలు)
రీఫండ్ విధానం:
1 సంవత్సరంలో పూర్తి చేస్తే 85% తిరిగి
2 సంవత్సరాల్లో 60% తిరిగి
3 సంవత్సరాల్లో 30% తిరిగి
3 సంవత్సరాల తర్వాత రీఫండ్ లేదు

అధ్యాయం 23: నేరాలు మరియు శిక్షలు
క్రింది పరిస్థితుల్లో చర్యలు తీసుకుంటారు:
తప్పుడు సమాచారం ఇవ్వడం
నకిలీ సర్టిఫికేట్లు ఉపయోగించడం
నియమాలను ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘించడం
పర్యావరణ చట్టం, 1986 ప్రకారం శిక్షలు విధిస్తారు
అధ్యాయం 24: తనిఖీలు మరియు ఆడిట్
కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి:
యాదృచ్ఛిక తనిఖీలు చేస్తుంది
ఆడిట్ నిర్వహిస్తుంది
ఉల్లంఘనలు ఉంటే: చర్యలు తీసుకుంటారు
అధ్యాయం 25: నిర్వహణ కమిటీ
ఈ నియమాల అమలుకు ఒక కమిటీ ఏర్పాటు చేస్తారు:
సభ్యులు:
కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి ఛైర్మన్
పర్యావరణ శాఖ ప్రతినిధులు
ఐటి, ఇంధన, పట్టణ అభివృద్ధి శాఖల ప్రతినిధులు
పరిశ్రమల ప్రతినిధులు
రీసైక్లింగ్ సంస్థల ప్రతినిధులు

**బాధ్యతలు:**
నియమాల అమలుపై పర్యవేక్షణ
సమస్యల పరిష్కారం
మార్పులు, సవరణలు సూచించడం

ముఖ్య షెడ్యూల్స్ (సంక్షిప్తంగా)
షెడ్యూల్--I
ఇ-వ్యర్థాల కింద వచ్చే పరికరాలు:
కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు
మొబైల్ ఫోన్లు
ప్రింటర్లు
టెలికమ్యూనికేషన్ పరికరాలు
సర్వర్లు
టీవీలు
షెడ్యూల్--II
ప్రమాదకర పదార్థాల పరిమితులు

షెడ్యూల్--III & IV
EPR లక్ష్యాలు, కాలపట్టికలు
షెడ్యూల్--V
అధికారుల విధులు
మొత్తం సారాంశం
ఈ నియమాల ముఖ్య లక్ష్యాలు:
ఇ-వ్యర్థాలను సక్రమంగా నిర్వహించడం
పర్యావరణాన్ని రక్షించడం
రీసైక్లింగ్ వ్యవస్థను బలపరచడం
తయారీదారుల బాధ్యత పెంచడం

# డైరెక్ట్ సెల్లింగ్‌పై తెలంగాణ ప్రభుత్వం కొత్త మార్గదర్శకాలు విడుదల



రాష్ట్రంలో వినియోగదారుల హక్కులను రక్షించేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. "తెలంగాణ రాష్ట్ర వినియోగదారుల సంరక్షణ (డైరెక్ట్ సెల్లింగ్ పర్యవేక్షణ, నియంత్రణ) మార్గదర్శకాలు-2025"ను అధికారికంగా జారీ చేసింది.

ఈ మార్గదర్శకాలు రాష్ట్రవ్యాప్తంగా డైరెక్ట్ సెల్లింగ్ సంస్థలు, విక్రేతల కార్యకలాపాలపై కట్టుదిట్టమైన నియంత్రణ తీసుకురావడమే లక్ష్యంగా రూపొందించబడ్డాయి. వినియోగదారుల హక్కులను పరిరక్షించడం, మోసపూరిత వ్యాపారాలను అరికట్టడం ప్రధాన ఉద్దేశంగా ప్రభుత్వం పేర్కొంది. డైరెక్ట్ సెల్లింగ్ సంస్థలు తప్పనిసరిగా ప్రభుత్వ నోడల్ శాఖ అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. నమోదు లేకుండా వ్యాపారం చేయడానికి అనుమతి ఉండదు. ఇప్పటికే పనిచేస్తున్న సంస్థలు కూడా తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని ఆదేశించారు.

ప్రతి సంస్థ తమ విక్రేతలపై పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుంది. విక్రేతలు చేసే తప్పిదాలకు సంస్థలు కూడా బాధ్యత వహించాల్సి ఉంటుంది. అలాగే విక్రేతల వివరాలు, రికార్డులు, లైసెన్సులు, పన్నుల వివరాలు వంటి అన్ని సమాచారాన్ని నిర్వహించడం తప్పనిసరి చేశారు.

ఈ మార్గదర్శకాల ప్రకారం పిరమిడ్ పథకాలు, మనీ సర్క్యులేషన్ స్కీములు పూర్తిగా నిషేధించబడ్డాయి. వినియోగదారులను మోసం చేసే ప్రకటనలు, తప్పుడు సమాచారం ఇవ్వడం వంటి చర్యలపై కఠిన చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం స్పష్టం చేసింది.

డైరెక్ట్ సెల్లింగ్ వ్యవస్థపై పర్యవేక్షణ కోసం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ త్రైమాసికంగా సమావేశమై వ్యవస్థ పనితీరును సమీక్షించనుంది.

ఫిర్యాదుల పరిష్కారం కోసం ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని కూడా సంస్థలకు ఆదేశాలు ఇచ్చారు. వినియోగదారుల ఫిర్యాదులను 45 రోజులలో పరిష్కరించాల్సి ఉంటుంది. ఈ మార్గదర్శకాలతో రాష్ట్రంలో డైరెక్ట్ సెల్లింగ్ రంగంలో పారదర్శకత పెరుగుతుందని, వినియోగదారులకు మరింత భద్రత లభిస్తుందని అధికారులు తెలిపారు.

# తిరుపతి వెంకటేశ్వర స్వామి చరిత్ర



వెంకటేశ్వర స్వామి భారతదేశంలో అత్యంత ప్రసిద్ధి చెందిన దేవతలలో ఒకరు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తిరుమల కొండలపై వెలసిన ఈ దేవస్థానం కోట్లాది భక్తుల విశ్వాసానికి ప్రతీకగా నిలుస్తోంది. ఈ స్వామిని బాలాజీ, శ్రీనివాస, గోవింద అనే పేర్లతో కూడా పిలుస్తారు.

వెంకటేశ్వర స్వామి అవతారానికి సంబంధించిన కథలు ప్రధానంగా పురాణాలలో కనిపిస్తాయి. ముఖ్యంగా వెంకటాచల మహాత్మ్యం లో ఈ స్వామి వైభవం వివరంగా వర్ణించబడింది. కథనం ప్రకారం, భూమిపై కలియుగంలో ప్రజలను రక్షించడానికి మహావిష్ణువు వెంకటేశ్వర స్వామిగా అవతరించాడు.

ఒక పురాణ కథనం ప్రకారం, మహర్షి భృగువు విష్ణువును పరీక్షించేందుకు ఆయన ఛాతిపై తన్నగా, ఆ ఘటనతో లక్ష్మీదేవి ఆవేదనతో వైకుంఠాన్ని విడిచిపెట్టి భూమికి వచ్చిందని చెబుతారు. అనంతరం విష్ణువు ఆమెను వెతుక్కుంటూ తిరుమల కొండలకు వచ్చి అక్కడే శ్రీనివాసుడిగా నివసించాడని విశ్వసిస్తారు.

తరువాత కాలంలో శ్రీనివాసుడు పద్మావతి దేవిని వివాహం



చేసుకున్నాడని కథనం ఉంది. ఈ వివాహం ఘనంగా జరిగిందని, అప్పటి నుండి ఈ క్షేత్రం అత్యంత పవిత్రమైన స్థలంగా మారిందని పురాణాలు చెబుతున్నాయి.

తిరుమల దేవస్థానం నిర్మాణ చరిత్ర కూడా విశేషమైనది. పల్లవులు, చాళుక్యులు, చోళులు వంటి రాజవంశాలు ఈ ఆలయాన్ని అభివృద్ధి చేశారు. ముఖ్యంగా విజయనగర సామ్రాజ్య కాలంలో ఈ దేవాలయానికి విస్తృతంగా దానం, నిర్మాణం జరిగింది.

ఈ ఆలయాన్ని ప్రస్తుతం తిరుమల తిరుపతి దేవస్థానం నిర్వహిస్తోంది. ప్రపంచంలోనే అత్యధిక ఆదాయం పొందే దేవాలయాలలో ఇది ఒకటి. ప్రతి రోజు లక్షలాది మంది భక్తులు దర్శనం కోసం ఇక్కడికి వస్తుంటారు.


తిరుపతి వెంకటేశ్వర స్వామి ఆలయం కేవలం ఆధ్యాత్మిక కేంద్రం మాత్రమే కాకుండా భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిబింబంగా నిలుస్తోంది. కలియుగంలో కోరిన కోరికలు తీర్చే దేవుడిగా భక్తులు ఈ స్వామిని విశ్వసిస్తున్నారు

భారతదేశంలో అత్యంత పవిత్రమైన తీర్థక్షేత్రాలలో ఒకటిగా నిలిచిన తిరుమల లో వెలసిన వెంకటేశ్వర స్వామి ఆలయం కోట్లాది భక్తుల ఆరాధ్యస్థానం. కలియుగంలో ప్రత్యక్షంగా భక్తులకు దర్శనమిచ్చే దేవుడిగా ఈ స్వామిని భావిస్తారు. ఈ వ్యాసంలో స్వామి చరిత్రను పురాణాల నుండి ఆధునిక కాలం వరకు విశదంగా పరిశీలిద్దాం.

1. అవతార రహస్యం -- కలియుగ దేవుడు

వెంకటేశ్వర స్వామి అవతారం గురించి అనేక పురాణాలు వివరించాయి. ముఖ్యంగా వెంకటాచల మహాత్మ్యం లో ఈ అవతారం విశేషంగా వర్ణించబడింది. భూమిపై పాపాలు పెరిగినప్పుడు, ప్రజలను రక్షించడానికి మహావిష్ణువు కలియుగంలో వెంకటేశ్వరునిగా అవతరించాడని విశ్వాసం.

పురాణ కథనం ప్రకారం, ఒకసారి మహర్షి భృగువు బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులలో ఎవరు శ్రేష్ఠుడో తెలుసుకోవడానికి పరీక్షించాడు.



విష్ణువు వద్దకు వెళ్లి ఆయన ఛాతిపై తన్నగా, విష్ణువు కోపం చూపకుండా వినమ్రంగా స్పందించాడు. కానీ ఈ ఘటనతో లక్ష్మీదేవి ఆవేదనకు గురై వైకుంఠాన్ని విడిచి భూమికి వచ్చిందని చెబుతారు.
అప్పుడు విష్ణువు ఆమెను వెతుక్కుంటూ భూమిపైకి వచ్చి తిరుమల కొండల్లో శ్రీనివాసుడిగా నివసించడం ప్రారంభించాడు. ఈ సంఘటననే వెంకటేశ్వర స్వామి అవతారానికి మూలంగా భావిస్తారు.

2. పద్మావతి పరిణయం -- దైవిక వివాహం

తిరుమల చరిత్రలో అత్యంత ముఖ్యమైన ఘట్టం శ్రీనివాసుడు పద్మావతి దేవిని వివాహం చేసుకున్న సందర్భం. పద్మావతి, ఆకాశరాజు కుమార్తెగా పురాణాలలో పేర్కొనబడింది.
శ్రీనివాసుడు ఆమెను వివాహం చేసుకోవడానికి అప్పు తీసుకున్నాడని ఒక విశ్వాసం ఉంది. ఈ కారణంగానే భక్తులు ఇప్పటికీ హుండీలో నైవేద్యాలు సమర్పిస్తూ స్వామి అప్పు తీర్చడంలో భాగస్వాములు అవుతున్నామని నమ్ముతారు.
ఈ దైవిక వివాహం తిరుమల క్షేత్రాన్ని మరింత పవిత్రంగా మార్చింది. ప్రతి సంవత్సరం జరిగే బ్రహ్మోత్సవాలు ఈ దైవిక ఘట్టాన్ని స్మరించేవిగా ఉంటాయి.

3. తిరుమల -- ఏడు కొండల వైభవం

తిరుమల ను "ఏడు కొండల క్షేత్రం" అని కూడా పిలుస్తారు. ఈ కొండలు ఆదిశేషుని ఏడు తలలుగా భావిస్తారు. అందుకే స్వామిని "శేషాచల వాసుడు" అని కూడా అంటారు.
ఈ ఏడు కొండల పేర్లు:
శేషాద్రి
నీలాద్రి
గరుడాద్రి
అంజనాద్రి
వృషభాద్రి
నారాయణాద్రి
వెంకటాద్రి
వీటిలో వెంకటాద్రి పై స్వామి ఆలయం నిర్మించబడింది. ఈ ప్రాంతం సహజ సౌందర్యంతో నిండినదిగా ఉండటమే కాకుండా ఆధ్యాత్మిక శక్తి కేంద్రంగా భావించబడుతుంది.

4. ఆలయ నిర్మాణ చరిత్ర

తిరుమల ఆలయం నిర్మాణం అనేక శతాబ్దాల చరిత్ర కలిగి ఉంది. పల్లవులు, చోళులు, చాళుక్యులు వంటి రాజవంశాలు ఈ ఆలయ అభివృద్ధికి తమ వంతు కృషి చేశారు.
ముఖ్యంగా విజయనగర సామ్రాజ్య కాలంలో ఆలయం విస్తృతంగా అభివృద్ధి చెందింది. శ్రీకృష్ణదేవరాయలు వంటి రాజులు ఆలయానికి విస్తారమైన దానాలు చేసి గోపురాలు, మండపాలు నిర్మించారు.



ఆలయంలోని గర్భగుడి, బంగారు గోపురం, రత్నాల అలంకరణలు భక్తులను ఆకర్షించే ముఖ్యాంశాలు.

5. తిరుమల తిరుపతి దేవస్థానం పాత్ర

ప్రస్తుతం ఈ ఆలయాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం నిర్వహిస్తోంది. భక్తులకు సౌకర్యాలు కల్పించడం, అన్నప్రసాదం, దర్శన వ్యవస్థ నిర్వహణ వంటి బాధ్యతలను సమర్థంగా నిర్వహిస్తోంది.

ప్రపంచంలోనే అత్యంత ధనిక దేవాలయ సంస్థలలో ఒకటి. ప్రతి రోజు లక్షలాది మంది భక్తులు స్వామి దర్శనం కోసం వస్తుంటారు.

6. దర్శన విధానం -- భక్తి పరాకాష్ఠ

తిరుమలలో స్వామి దర్శనం పొందడం భక్తులకు అత్యంత పవిత్రమైన అనుభూతి. "గోవిందా గోవిందా" నినాదాలతో ఆలయం మారుమోగుతుంది.

సర్వదర్శనం, శీఘ్రదర్శనం, ప్రత్యేక ప్రవేశ దర్శనం వంటి పద్ధతులు ఉన్నాయి. భక్తులు గంటల తరబడి క్యూలో నిలబడి స్వామి దర్శనం పొందడం వారి భక్తిని సూచిస్తుంది.

7. లడ్డూ ప్రసాదం -- ప్రత్యేకత



తిరుమల లడ్డూ ప్రసాదం ప్రపంచ ప్రసిద్ధి పొందింది. ఇది దేవునికి నైవేద్యంగా సమర్పించి భక్తులకు అందిస్తారు. ఈ లడ్డూకి ప్రత్యేక భౌగోళిక గుర్తింపు కూడా లభించింది.

8. ఉత్సవాలు -- ఆధ్యాత్మిక వైభవం

తిరుమలలో జరిగే బ్రహ్మోత్సవాలు అత్యంత ఘనంగా జరుగుతాయి. ఈ సందర్భంగా స్వామిని వివిధ వాహనాలపై ఊరేగిస్తారు.

వైకుంఠ ఏకాదశి, రథసప్తమి వంటి పండుగలు కూడా ఎంతో వైభవంగా నిర్వహించబడతాయి.

9. సామాజిక సేవలు

అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోంది:

ఉచిత అన్నదానం

విద్యాసంస్థలు


ఆసుపత్రులు

గోశాలలు

ఇవి సమాజానికి ఎంతో మేలు చేస్తున్నాయి.

10. ముగింపు

వెంకటేశ్వర స్వామి కేవలం ఒక దేవత మాత్రమే కాదు, భక్తుల విశ్వాసానికి నిలువెత్తు ప్రతీక. కలియుగంలో కోరిన కోరికలు తీర్చే దేవుడిగా ఆయనను కోట్లాది మంది నమ్ముతారు. తిరుమల క్షేత్రం ఆధ్యాత్మికత, సంప్రదాయం, భక్తి సమ్మేళనంగా నిలుస్తూ ప్రపంచవ్యాప్తంగా హిందూ సంస్కృతికి ప్రతినిధిగా కొనసాగుతోంది.



# యాదగిరిగుట్ట
# భక్తి, చరిత్ర, ఆధ్యాత్మిక మహిమాన్వితం



తెలంగాణ రాష్ట్రంలోని ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రాలలో ఒకటైన యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం భక్తుల విశ్వాసానికి ప్రతీకగా నిలుస్తోంది. ప్రస్తుతం యాదాద్రి పేరుతో ప్రసిద్ధి చెందిన ఈ పుణ్యక్షేత్రం, యాదాద్రి భువనగిరి జిల్లాలో కొండపై నిర్మితమై ఉంది. ఈ క్షేత్రానికి వేల సంవత్సరాల చరిత్ర ఉండటమే కాకుండా, భక్తుల కోరికలను నెరవేర్చే దేవుడిగా శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ప్రత్యేకమైన స్థానం పొందారు.

**స్థల విశేషాలు**

యాదగిరిగుట్ట ఒక కొండపై నిర్మించబడిన పవిత్ర స్థలం. ఈ కొండపై ఉన్న గుహలో స్వయంభూ రూపంలో నరసింహ స్వామి దర్శనమిస్తారని విశ్వాసం. గుహలో స్వామి ఐదు విభిన్న రూపాల్లో దర్శనమిస్తారని పురాణాలు చెబుతున్నాయి. వీటిలో జ్వాలా నరసింహ, యోగానంద నరసింహ, గంధభేరుండ నరసింహ, ఉగ్ర నరసింహ, లక్ష్మీ నరసింహ రూపాలు ముఖ్యమైనవి.

ఈ గుహలోని ఆధ్యాత్మిక వాతావరణం భక్తులను ఎంతో ఆకర్షిస్తుంది. కొండపైకి చేరుకోవడానికి రోడ్డు మార్గం, మెట్లు రెండూ అందుబాటులో ఉన్నాయి. ప్రతి రోజు వేలాది మంది భక్తులు ఇక్కడికి



వచ్చి స్వామి దర్శనం పొందుతున్నారు.

## చారిత్రక నేపథ్యం

యాదగిరిగుట్టకు సంబంధించిన కథలు పురాణాలలో కనిపిస్తాయి. యాదవ మహర్షి అనే ఋషి ఇక్కడ తపస్సు చేసి, నరసింహ స్వామిని దర్శించుకున్నారని కథనం. అందువల్ల ఈ ప్రాంతానికి యాదగిరి అనే పేరు వచ్చింది. కాలక్రమేణా అది యాదగిరిగుట్టగా మారింది.

ఇటీవలి కాలంలో తెలంగాణ ప్రభుత్వం ఈ దేవస్థానాన్ని భారీగా అభివృద్ధి చేసింది. సంప్రదాయ శిల్పకళను ప్రతిబింబించేలా ఆలయాన్ని పునర్నిర్మించారు. గోపురాలు, మండపాలు, రాతి శిల్పాలు అన్నీ కూడా ద్రావిడ శైలిలో నిర్మించబడ్డాయి.

## ఆలయ నిర్మాణం

యాదాద్రి ఆలయం నిర్మాణం భారతీయ శిల్పకళకు అద్భుత ఉదాహరణగా నిలుస్తుంది. రాతితో నిర్మించిన ఈ ఆలయంలోని ప్రతి భాగం ప్రత్యేకంగా చెక్కబడింది. స్తంభాలు, గోపురాలు, మండపాలు



అన్నీ శిల్పుల నైపుణ్యాన్ని తెలియజేస్తాయి. ఆలయంలో గర్భగుడి అత్యంత పవిత్రమైన భాగం. భక్తులు ఇక్కడ స్వామి దర్శనం పొందుతూ తమ కోరికలను కోరుకుంటారు. ఆలయంలో నిర్వహించే పూజలు, సేవలు సంప్రదాయబద్ధంగా జరుగుతాయి.

## పూజలు మరియు ఉత్సవాలు

యాదగిరిగుట్టలో ప్రతి రోజు పూజలు ఎంతో వైభవంగా జరుగుతాయి. ప్రత్యేకంగా బ్రహ్మోత్సవాలు, నరసింహ జయంతి సందర్భంగా లక్షలాది మంది భక్తులు పాల్గొంటారు. ఈ సందర్భంగా ఆలయం మొత్తం దీపాలతో, పుష్పాలతో అలంకరించబడుతుంది.

భక్తులు తమ కోరికల కోసం ప్రత్యేక పూజలు, అర్చనలు చేస్తారు. అక్షయ తృతీయ, వైకుంఠ ఏకాదశి వంటి పర్వదినాల్లో భక్తుల రద్దీ మరింతగా ఉంటుంది.

## ఆధ్యాత్మిక ప్రాముఖ్యత

యాదగిరిగుట్ట భక్తులకు ఒక ఆధ్యాత్మిక శాంతిని అందించే ప్రదేశంగా ప్రసిద్ధి చెందింది. ఇక్కడి వాతావరణం, పూజా విధానాలు మనసుకు ప్రశాంతతను కలిగిస్తాయి. అనేక మంది భక్తులు తమ జీవిత సమస్యలకు పరిష్కారం కోసం ఇక్కడికి వచ్చి స్వామిని ప్రార్థిస్తారు. ఈ క్షేత్రం తెలంగాణ రాష్ట్రంలోనే కాకుండా దేశవ్యాప్తంగా కూడా ప్రసిద్ధి పొందింది. ప్రతి సంవత్సరం లక్షలాది మంది భక్తులు యాదాద్రిని దర్శించుకుంటున్నారు.

## అభివృద్ధి మరియు ఆధునిక సౌకర్యాలు

ఇటీవల కాలంలో యాదాద్రిని అంతర్జాతీయ స్థాయి పుణ్యక్షేత్రంగా అభివృద్ధి చేశారు. భక్తుల కోసం వసతి గృహాలు, భోజనశాలలు, పార్కింగ్ సౌకర్యాలు వంటి అనేక సదుపాయాలు ఏర్పాటు చేశారు. రహదారులు విస్తరించి, ప్రయాణ సౌకర్యాలు మెరుగుపరిచారు.

ఈ అభివృద్ధితో యాదాద్రి మరింత ఆకర్షణీయంగా మారింది. ప్రభుత్వం ఆలయాన్ని ప్రపంచ స్థాయి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతోంది.



## ముగింపు

యాదగిరిగుట్ట ఒక పుణ్యక్షేత్రం మాత్రమే కాదు, భక్తి, చరిత్ర, సంస్కృతి కలిసిన ఆధ్యాత్మిక కేంద్రం. ఇక్కడి దేవాలయం, శిల్పకళ, పూజా విధానాలు అన్నీ కలిసి భక్తులకు ఒక ప్రత్యేక అనుభూతిని అందిస్తాయి. తెలంగాణలోని ఈ పవిత్ర క్షేత్రం భక్తుల విశ్వాసానికి చిరస్మరణీయంగా నిలుస్తూ, భవిష్యత్తులో కూడా మరింతగా అభివృద్ధి చెందుతూ ప్రపంచవ్యాప్తంగా పేరు పొందుతుందని చెప్పవచ్చు.

